ANN తెలుగు
Follow: @ANNTELUGU
14-04-2025
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 133 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## భగ్గుమన్న మైనార్టీలు

### వక్ఫ్ సవరణ బిల్లుపై గళమెత్తిన ముస్లింలు

### ట్యాంక్ బండ్ పై భారీ ఆందోళన

**మహా:** ఇటీవల కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో చట్టం చేసిన వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ముస్లింలు, ముస్లిం సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్ ముస్లిం సంఘాలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ ర్యాలీ హిమాయత్ నగర్, లిబర్టీ మీదుగా ట్యాంక్ బండ్ మీదుగా కొనసాగింది.

మిగతా 2లో

**టాప్ న్యూస్**

### వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా 19న హైదరాబాద్‌లో బహిరంగసభ

- ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ
- కేంద్రానిది ఏకపక్ష నిర్ణయం



02

### రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

- జీహెచ్ఎంసీ ఎన్నికల్లో తిరస్కరించండి
- మల్కాజ్ గిరిలో కేటీఆర్



02

### వాట్సాప్ ద్వారా తెలంగాణ ఇంటర్ ఫలితాలు

- ఏప్రిల్ 25న వెల్లడించే ఛాన్స్
- లేటైనా.. తప్పులకు ఆస్కారం లేకుండా రిజల్ట్



02




# భూభారతికి శ్రీకారం

### నేటి నుండి ప్రయోగాత్మకంగా అమలు

### మూడు మండలాల్లో పైలట్ ప్రాజెక్టు మొదలు

### రైతులకు అర్థమయ్యే సులభమైన భాషలో పోర్టల్ ఉండాలి

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం



రాష్ట్రంలో భూభారతి పోర్టల్‌ను తొలుత ఎంపిక చేసిన మూడు మండలాల్లో ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. పోర్టల్‌పై అవగాహన కల్పించేందుకు అన్ని మండలాల్లో సదస్సులు నిర్వహించనున్నారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ఈ సేవలను విస్తరించనున్నారు. పోర్టల్‌ను సోమవారం ప్రారంభించనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. - మహా, హైదరాబాద్

వివరాలు 3లో

### ఎస్సీ వర్గీకరణకు రైట్ రైట్

- దశాబ్దాల వర్గీకరణ కల నెరవేరుస్తున్న రేవంత్ సర్కార్
- నేడే జీవో విడుదల.. ముఖ్యమంత్రికి జీవో అందజేయనున్న సబ్ కమిటీ
- మంత్రి ఉత్తమ్ సారథ్యంలోని క్యాబినెట్ సబ్‌కమిటీ తుది ఆమోదం

03

# కాంగ్రెస్‌లో కాక

### సంచలనంగా రాజగోపాల్ కామెంట్స్



- సర్కారుకు 16 మాసాలు.. ఇంకెపుడు విస్తరణ?
- పదవులపై గొంతెత్తుతున్న ఆశావహులు
- ఏప్రిల్ 3న ఖరారనుకున్న దశలో.. బ్రేక్
- పీసీసీ కార్యవర్గం, డీసీసీలది ఇదే కథ

కాంగ్రెస్ లో పదవులపై జాప్యం జరుగుతున్న కొద్దీ మెల్లిమెల్లిగా ఆశావహులు గళం విప్పుతున్నారు. ఏప్రిల్ 3న మంత్రివర్గ విస్తరణ ఖరారని అనుకున్న దశలో ఒక్కసారిగా వాయిదాపడడంతో ఇందుకు కారణాలపై ఆరోపణలు, విమర్శలు మొదలయ్యాయి. జానారెడ్డి అడ్డుపడడం వల్లే విస్తరణ ఆగిందని భావిస్తున్న రాజగోపాల్ రెడ్డి ఆదివారం సూటిగానే కామెంట్స్ చేశారు. ధర్మరాజులా ఉండాలని, ధ్రుతరాష్ట్రుడిలా మారొద్దంటూ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో ఒక్కసారిగా కాక పుట్టించాయి. రాహుల్ గాంధీ, ఖర్గే, కేసీ వేణుగోపాల్ వద్ద జరిగిన చర్చల్లో సుదర్శన్ రెడ్డి, వివేక్, రాజగోపాల్ రెడ్డి, వాకిటి శ్రీహరిలకు పదవులు ఖరారు కాగా, ముహూర్తం కూడా డిసైడయినట్లు కాంగ్రెస్ వర్గాలు అంతర్గతంగా చెబుతున్నాయి. - మహా, హైదరాబాద్

02

### ధృతరాష్ట్రుడిలా జానారెడ్డి

- నాకు మంత్రి పదవి రాకుండా అడ్డుపడుతున్నారు: కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి
- పార్లమెంట్ ఇన్ ఛార్జిగా ఒక ఎమ్మెల్యేకు బాధ్యత ఎందుకు అప్పగించారు?
- గెలిపించే దమ్ము ఉందనే బాధ్యత ఇచ్చారు.. నెరవేర్చా
- సమర్థత ఉన్న యువకులకే అవకాశాలివ్వాలి
- కాంగ్రెస్ బతకాలంటే.. ఢీ అంటే ఢీ అనేవారిని ప్రోత్సహించాలి

02

### రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాల్సిందే

- చౌటుప్పల్ సభలో ఎంపీ, ఎమ్మెల్యేల డిమాండ్
- ఎక్కడ సంతకం పెట్టమంటే.. అక్కడ పెడతాం

02



### సంక్షేమంలో తెలంగాణ దేశానికే ఆదర్శం

- గత పాలకులు పదేళ్లపాటు సన్న బియ్యం సంగీతం పాడారు తప్ప ఇవ్వలేదు
- సన్న బియ్యానికి ఏడాదికి 13,525 కోట్లు ..రూ 9వేల కోట్ల తో రాజీవ్ యువ వికాసం
- జూన్ 2 నుంచి రాజీవ్ యువ వికాసం అనుమతి పత్రాలు పంపిణీ
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వివరాలు 6లో

## అంబేద్కర్ ఆశయాలను బీజేపీ అమలు చేస్తుంది

### కాంగ్రెస్ పై నిప్పులు చెరిగిన బండి సంజయ్

### కరీంనగర్ లో బీజేపీ కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీ

### అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధి చేసిన బండి సంజయ్



**కరీంనగర్, మహా :** అణగారిన వర్గాల్లో వెలుగులు నింపడంతోపాటు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఫరిఢవిల్లేలా రాజ్యాంగాన్ని రచించిన భారత అంబేద్కర్ ను అడుగడుగున అవమానించిన నీచమైన చరిత్ర కాంగ్రెస్ పార్టీది కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. అంబేద్కర్ అంత్యక్రియలు ఢిల్లీలో జరగనీయకుండా ముంబైకి తరలించిన కాంగ్రెస్ పార్టీ ఆ తరలింపుకయ్యే విమాన ఛార్జీలు చెల్లించాలంటూ అంబేద్కర్ సతీమణికి బిల్లులు పంపిన నీచాతినీచమైన చరిత్ర కాంగ్రెస్ దేనని విమర్శించారు.

మిగతా 2లో

### ఉప ముఖ్యమంత్రి అయినా కొడుక్కి తండ్రే!

- మార్క్ తో పవన్ ఎమోషనల్ బాండింగ్
- సింగపూర్ నుండి హైదరాబాద్ కు

02






# వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా 19న హైదరాబాద్‌లో బహిరంగసభ

## ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ.. కేంద్రానిది ఏకపక్ష నిర్ణయం



**మహా:** వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ఈనెల 19న హైదరాబాద్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం నేత అసదుద్దీన్ ఓవైసీ తెలిపారు. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో సభ జరుగుతుందన్నారు. ఈ బహిరంగసభకు దేశవ్యాప్తంగా మతపెద్దలు, పలువురు రాజకీయ నేతల హాజరు కానున్నారన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తో పాటు దేశ వ్యాప్తంగా ఉన్న ముస్లిం నాయకులు పాల్గొంటారన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ బిల్లును రాజ్యాంగ వ్యతిరేకంగా తీసుకొస్తుందని, ఆర్టికల్ 23, 26 లను అడ్డు పెట్టుకొని వక్ఫ్ భూములు దోచుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని అసదుద్దీన్ మండిపడ్డారు. ముస్లింలకు అన్యాయం చేసేందుకు బీజేపీ అనుబంధ పార్టీల నాయకులు చంద్రబాబు, నితీష్ కుమార్, జయంత్ చౌదరి తదితరులు మద్దతుతో వక్ఫ్ బిల్లును రూపొందించిందన్నారు. హిందూ ధర్మం, జైన ధర్మం, సిక్ ధర్మం బోర్డులో వారికీ సంబంధించిన వారు మాత్రమే సభ్యులుగా ఉంటారని, వక్ఫ్ బోర్డులో ఇతర మతస్థులు ఎలా ఉంటారని ప్రశ్నించారు. వక్ఫ్ బిల్లు ప్రకారం వక్ఫ్ భూములను అక్రమంచిన వారికి కట్టబెట్టే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. సెక్షన్ 3డి, ఏఎస్ఎంఆర్ యాక్ట్ ప్రకారం ముస్లింల కు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. వక్ఫ్ బిల్లులో ని సెక్షన్ 2 ద్వారా కూడా ముస్లిం లకు అన్యాయం జరుగనుందని, బీజేపీ వక్ఫ్ భూములు వాడకంలో లేవు అని తప్పుగా వాదిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రామ్ మందిర్ తీర్పులో వక్ఫ్ భూములు నిరూపయోగంగా మారాయని తెలిపారన్నారు. ఢిల్లీలో 120 ప్రాపర్టీస్ వెనక్కి తీసుకుందుకు ఢిల్లీ ప్రభుత్వం వక్ఫ్ బోర్డు కు లేఖ రాసిందని, ఆ లేఖ ద్వారా చాలా మసీద్ లు దర్గాలు ఉన్న స్థలాలు, ప్రాంతాలు వక్ఫ్ బోర్డు నుండి చేజారిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. టీటీడీ ఆలయంలో కేవలం హిందువులను మాత్రమే ఉద్యోగులుగా కొనసాగిస్తుండగా వక్ఫ్ బిల్లుకు చంద్రబాబు నాయుడు ఏ విధంగా మద్దతు ఇస్తున్నారని అసదుద్దీన్ ప్రశ్నించారు. వక్ఫ్ బోర్డును పోస్ట్ గా ఆఫీస్ మార్చే విధంగా అధికారులను నియమిస్తూ వక్ఫ్ బిల్లులో అంశాలను చేర్చారు.

# కాంగ్రెస్‌లో కాక

## సంచలనంగా రాజగోపాల్ కామెంట్స్



- సర్కారుకు 16 మాసాలు.. ఇంకెప్పుడు విస్తరణ?
- పదవులపై గొంతెత్తుతున్న ఆశావహులు
- ఏప్రిల్ 3న ఖరారనుకున్న దశలో.. బ్రేక్
- పీసీసీ కార్యవర్గం, డీసీసీలది ఇదే కథ

హైదరాబాద్, మహా: కాంగ్రెస్ లో పదవులపై జాప్యం జరుగుతున్న కొద్దీ మెల్లిమెల్లిగా ఆశావహులు గళం విప్పుతున్నారు. ఏప్రిల్ 3న మంత్రివర్గ విస్తరణ ఖరారని అనుకున్న దశలో ఒక్కసారిగా వాయిదాపడడంతో ఇందుకు కారణాలపై ఆరోపణలు, విమర్శలు మొదలయ్యాయి. జానారెడ్డి అడ్డుపడడం వల్లే విస్తరణ ఆగిందని భావిస్తున్న రాజగోపాల్ రెడ్డి ఆదివారం సూటిగానే కామెంట్స్ చేశారు. ధర్మరాజులా ఉండాలని, ధ్రుతరాష్ట్రుడిలా మారొద్దంటూ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో ఒక్కసారిగా కాక పుట్టించాయి. రాహుల్ గాంధీ, ఖర్గే, కేసీ వేణుగోపాల్ వద్ద జరిగిన చర్చల్లో సుదర్శన్ రెడ్డి, వివేక్, రాజగోపాల్ రెడ్డి, వాకిటి శ్రీహరిలకు పదవులు ఖరారు కాగా, ముహూర్తం కూడా డిసైడయినట్లు కాంగ్రెస్ వర్గాలు అంతర్గతంగా చెబుతున్నాయి. అయితే అనూహ్యంగా అది ఆచరణకు నోచుకోలేదు. నల్లగొండ జిల్లాకు చెందిన సీనియర్ నేత జానారెడ్డి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరడం తనను అడ్డుకోవడానికే అని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బహిరంగంగా వ్యాఖ్యానించారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో ఒక్కసారిగా ఈ వ్యాఖ్యలు హీట్ పుట్టించాయి. మరోవైపు కాంగ్రెస్ పార్టీలో మాదిగ, లంబాడా, మైనారిటీ వర్గాలు కూడా మంత్రి పదవిని ఆశిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైకమాండ్ కే నిర్ణయాన్ని వదిలేయగా, కూర్పు హైకమాండ్ కు క్లిష్టంగా మారింది. 20మందికి పైగా ఎమ్మెల్యేలు మంత్రి పదవులపై ఆశలు పెట్టుకున్నారు. పలు జిల్లాలకు ఇప్పటికీ మంత్రులు లేరు.

### పీసీసీది కూడా ఇదే కథ

పీసీసీ కార్యవర్గం, డిసిసిలది కూడా ఇదే కథ. పీసీసీ చీఫ్ ను నియమించి ఏడు మాసాలవుతుండగా, ఇప్పటిదాకా కార్యవర్గాన్ని నియమించలేదు. త్వరలో వర్కింగ్ ప్రెసిడెంట్లు, కార్యవర్గం ఖరారు అంటూ ప్రకటనలు వస్తున్నా అవి కార్యరూపం దాల్చడం లేదు. డిసిసిలకు సంబంధించి సర్వేలు పూర్తయి, ముఖ్యమంత్రి, పిసిసి చీఫ్, డిప్యూటీసీఎం, మంత్రి ఉత్తమ్ ల సారథ్యంలో హైలెవెల్ కమిటీ హైకమాండ్ కు జాబితా ఇచ్చినా విడుదలలో జాప్యం జరుగుతుందన్న ప్రచారముంది. ఇతర రాష్ట్రాల డిసిసిలతో కలిపి విడుదల చేస్తారని గత రెండుమాసాలుగా చెబుతున్నారు. చాలా జిల్లాలకు డిసిసి అధ్యక్షులు లేరు. ఇక పీసీసీ కార్యవర్గం లేకపోవడంతో మహేష్ కుమార్ గౌడ్ పై అదనపు భారం పడుతోంది. ఇంకా నామినేటెడ్ పదవులు కూడా చాలా పెండింగ్ ఉన్నాయి. పార్టీపరమైన పదవులు భర్తీచేసినా కాంగ్రెస్ క్యాడర్ యాక్టివ్ అయ్యే అవకాశముందని, స్థానిక ఎన్నికలకు ఇది కలిసి వస్తుందని హైకమాండ్ కు ఫీడ్ బ్యాక్ అందింది. అయితే నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం పార్టీకి ఇబ్బందులు తెచ్చిపెడుతోంది.

# ధృతరాష్ట్రుడిలా జానారెడ్డి



**చౌటుప్పల్, మహా:** మంత్రి పదవి ఇస్తానని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, కానీ తన మంత్రి పదవి విషయంలో కొందరు రాజకీయాలు చేస్తున్నారని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. చౌటుప్పల్ మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారోత్సవంలో ఆయన మంత్రిపదవులపై స్పందించారు. మహాభారతంలో ధర్మరాజులాగా వ్యవహరించాల్సిన జానారెడ్డి వంటి వారు ప్రస్తుతం ధృతరాష్ట్రుడి పాత్ర పోషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నా మంత్రి పదవి విషయంలో జానారెడ్డి అడ్డుతగలడం చూసి చాలా బాధగా ఉందన్నారు. ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్, మహబూబ్‌నగర్ వంటి జిల్లాల్లో పార్లమెంట్ సీట్లను గెలిపించే బాధ్యతను మంత్రులకు ఇస్తే, భువనగిరికి మాత్రం ఎమ్మెల్యేనైనా తనను ఇంఛార్జ్‌గా పెట్టారని రాజగోపాల్ రెడ్డి గుర్తుచేశారు. లోక్ సభ స్థానాన్ని గెలిపించే సత్తా లేకుంటే నన్ను ఎందుకు ఇంఛార్జ్‌గా పెడతారని ప్రశ్నించారు. భువనగిరి ఎంపీ సీటును గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తానని పార్టీ హామీ ఇచ్చిందన్నారు.

**ఇప్పుడు గుర్తుకొచ్చిందా?**

కాంగ్రెస్ పార్టీలో పదవులను నిజాయతీగా, సమర్థవంతంగా ఢీ అంటే ఢీ అని పనిచేసే వ్యక్తులకే ఇవ్వాలని రాజగోపాల్ రెడ్డి అభిప్రాయపడ్డారు. పదవుల కోసం లాబియింగ్ చేసే వారిని పక్కన పెట్టాలని, కాంగ్రెస్ పార్టీ బలపడాలంటే యువకులను రాజకీయాల్లో ప్రోత్సహించాలని పేర్కొన్నారు. తాను అడుక్కునే స్థితిలో ఎప్పుడూ ఉండనని, మంత్రి పదవి అడుక్కుంటే వచ్చేది కాదన్నారు. జానారెడ్డి 30 ఏళ్లపాటు మంత్రి పదవి అనుభవించారని, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు మంత్రి పదవి ఇవ్వాలని ఇప్పుడు గుర్తుకొచ్చిందా? అని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గద్దెదింపాలని లక్ష్యంతోనే తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరానని, దాని ప్రకారమే కేసీఆర్‌ను గద్దె దింపినట్లు చెప్పారు. అది తన కమిట్మెంట్ అని రాజగోపాల్ రెడ్డి అన్నారు. కొన్ని కార్యక్రమాల విషయంలో కాంగ్రెస్ పార్టీలో అవమానం జరిగిందని బీజేపీలో చేరానని, కానీ ప్రజల కోరిక మేరకు ప్రజాస్వామ్యం తరపున పోరాడటానికి మళ్లీ తిరిగి వచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి రావడానికి శక్తివంచన లేకుండా పనిచేసినట్లు తెలిపారు.

# అంబేద్కర్ ఆశయాలను బీజేపీ అమలు చేస్తుంది

## కాంగ్రెస్ పై నిప్పులు చెరిగిన బండి సంజయ్

### కరీంనగర్ లో బీజేపీ కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీ
### అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధి చేసిన బండి సంజయ్



(మొదటిపేజీ తరువాయి)

అంబేద్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆదివారం కరీంనగర్ లోని అంబేద్కర్ స్టేడియం వద్దకు వచ్చారు. అంబేద్కర్ చిత్రపటాలు, కాషాయ జెండాలతో కార్యకర్తలు నిర్వహించిన బైక్ ర్యాలీలో బండి సంజయ్ పాల్గొన్నారు. బీజేపీ నాయకులతో కలిసి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని మంచి నీళ్లతో శుద్ధి చేశారు .ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా అంబేద్కర్ జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని. అందులో భాగంగా అంబేద్కర్ విగ్రహాలను శుద్ధి చేయడం, అంబేద్కర్ గొప్ప చరిత్రను భావితరాలకు తెలియజేయడం, మనలోని అజ్ఞానాన్ని పారదోలి వెలుగులు నింపుకునేలా చేయడం. ఆయన ఆశయాలను కొనసాగించడం అణగారిన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు అంబేద్కర్ అని అన్నారు. అంటరానితనాన్ని పాతాళానికి తొక్కి కుల రక్కసిని కూకటివేళ్లతో పెకలించేందుకు తన జీవిత సర్వస్వాన్ని ధారపోసిన మేధావి. భారత ప్రజాస్వామ్యానికి దిక్సూచి అని కొనియాడారు. అణగారిన వర్గాల ఆత్మగౌరవ పతాకం అంబేద్కర్ అనీ, అతిపేద దళిత కుటుంబంలో పుట్టి తిండి కోసం అనేక తిప్పలు పడ్డ వ్యక్తి అని అన్నారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్ దయాళ్ ఆలోచనా విధానాన్ని బలపర్చిన వ్యక్తి అంబేద్కర్ అని, దేశ విభజనను, జమ్మూకాశ్మీర్ కు స్వయం ప్రతిపత్తిని వ్యతిరేకించారని పేర్కొన్నారు.

అంబేద్కర్ ఆశయాల సాధనకు బీజేపీ తూ.చ తప్పకుండా కృషి చేస్తున్న ప్రభుత్వం నరేంద్రమోదీదేనని తెలిపారు. భావితరాలకు అంబేద్కర్ చరిత్ర తెలిసేలా పంచ తీర్థాలను మోడీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, దళితుడైన రామ్ నాథ్ కోవింద్, ఆదివాసీ ముర్ముకు రాష్ట్రపతి పదవితో గౌరవించింది బీజేపీ పార్టీ అని అన్నారు. 12 మంది దళితులకు, 27 మంది ఓబీసీలకు, 8 మంది మహిళలకు మోడీ తన క్యాబినెట్ లో చోటు కల్పించారని పేర్కొన్నారు. జాతీయ బీసీ కమిషన్ కు రాజ్యాంగ బద్ధత కల్పించారన్నారు. 2023లో నారీ శక్తి వందన్ బిల్లు (33% రిజర్వేషన్లు) ప్రవేశపెట్టడం... ఆర్టికల్ 370 రద్దు చేయడం బీజేపీ ఘనతేనని చెప్పారు. అంబేద్కర్ ను కాంగ్రెస్ పార్టీ అడుగడుగునా అవమానించిందని, 1951లో హిందూకోడ్ బిల్లు, సామాజిక న్యాయ సాధికారత అంశాలపై అంబేద్కర్ అభిప్రాయాలను నెహ్రూ వ్యతిరేకిస్తే మనస్తాపానికి గురై న్యాయ శాఖ మంత్రి పదవికి అంబేద్కర్ రాజీనామా చేశారన్నారు. ఆ తరువాత 1952 ఎన్నికల్లో కమ్యూనిస్టులతో కలిసి, 1954 ఉప ఎన్నికల్లో స్వయంగా అభ్యర్థిని నిలబెట్టి అంబేద్కర్ ను ఓడించిన నీచమైన చరిత్ర కాంగ్రెస్ ది అని అన్నారు.

# రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాల్సిందే

## చౌటుప్పల్ సభలో ఎంపీ, ఎమ్మెల్యేల డిమాండ్.. ఎక్కడ సంతకం పెట్టమంటే.. అక్కడ పెడతాం

**హైదరాబాద్,మహా:** చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకున్నది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలంతా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి మంత్రి ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాలాంటి వ్యక్తి మంత్రి పదవి ఇవ్వాలని పదేపదే అడుగుతుంటే చాలా బాధేస్తుంది' అని రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సభలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని అధిష్టానాన్ని కోరారు. మేమంతా రాజగోపాల్ రెడ్డి కోసం ఎక్కడ సంతకం చేయాలన్నా చేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. రాజగోపాల్ రెడ్డి లాంటి గొప్ప వ్యక్తికి మంత్రి పదవి ఇస్తే పార్టీ, ప్రభుత్వం మరింత బలపడుతుందని మేము భావిస్తున్నామని అన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల మీద విజన్, సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న వ్యక్తి రాజగోపాల్ రెడ్డి అని తెలిపారు.

**రాజగోపాల్ రెడ్డి వల్లే ఎంపీ గెలుపు- చామల**

భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. 'చామల కిరణ్ కుమార్ రెడ్డి అనే నేను పెద్ద పాపులర్ పర్సన్ కాదు. పార్టీలో కింది స్థాయి నుంచి కష్టపడితే పార్టీ నాకు టికెట్ ఇచ్చింది. నా గెలుపును తన భుజాల మీద వేసుకొని గెలిపించిన వ్యక్తి రాజగోపాల్ రెడ్డి. రాజగోపాల్ రెడ్డి లేకపోతే నా గెలుపు అంత సులువు అయ్యేది కాదు. తనను ఎంపీగా గెలిపిస్తే రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చిన మాట వాస్తవమే. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడానికి క్రియాశీలక పాత్ర రాజగోపాల్ రెడ్డిది. 2014 ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లీడర్లను ఆర్థికంగా ఆదుకున్న వ్యక్తి రాజగోపాల్ రెడ్డి. ఇచ్చిన మాట ప్రకారం రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి' అని చామల కిరణ్ డిమాండ్ చేశారు.

### రాజగోపాల్ రెడ్డికి ఇవ్వాలి - ఎమ్మెల్యే కుంభం

భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి నల్లగొండ జిల్లా మీద రాజగోపాల్ రెడ్డికి పూర్తి పట్టు ఉందన్నారు. ప్రజల్లో, అభిమానుల్లో రాజగోపాల్ రెడ్డి స్థానం ఎప్పటికీ సుస్థిరంగా ఉంటుందని తెలిపారు. రాజగోపాల్ రెడ్డికి జిల్లాలోనే కాదు రాష్ట్రమంతా అభిమానులు ఉన్నారని అన్నారు.

# భగ్గుమన్న మైనార్టీలు



(మొదటిపేజీ తరువాయి)

అక్కడి నుంచి అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. వక్ఫ్ చట్టంతో వక్ఫ్ ఆస్తులను నాశనం చేయడానికి, వక్ఫ్ ఆస్తులను హిందూ సంఘాలకు కట్టబెట్టడానికి మోడీ కుట్ర చేస్తున్నారని పలు ముస్లిం సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో చట్టం చేసిన వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ముస్లింలు, ముస్లిం సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్ ముస్లిం సంఘాలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ ర్యాలీ హిమాయత్ నగర్, లిబర్టీ మీదుగా ట్యాంక్ బండ్ మీదుగా కొనసాగింది. అక్కడి నుంచి అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. వక్ఫ్ చట్టంతో వక్ఫ్ ఆస్తులను నాశనం చేయడానికి, వక్ఫ్ ఆస్తులను హిందూ సంఘాలకు కట్టబెట్టడానికి మోడీ కుట్ర చేస్తున్నారని పలు ముస్లిం సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

**వక్ఫ్ సవరణ బిల్లు నిలుపుదల చేయాలి**

వక్ఫ్ సవరణ బిల్లును నిలుపుదల చేయాలని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. మాజీమంత్రి షబ్బీర్ అలీ, జాతీయమైనారిటీ నాయకులు ఫహీమ్ ఖురేషీ, వివిధ ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్ కు ముస్లింలు భారీగా తరలివచ్చారు.



# ఉప ముఖ్యమంత్రి అయినా కొడుక్కి తండ్రే!

## మార్క్ తో పవన్ ఎమోషనల్ బాండింగ్

### సింగపూర్ నుండి హైదరాబాద్ కు

**హైదరాబాద్, మహా:** ప్రధాన మంత్రి.. ముఖ్యమంత్రి.. ఉప ముఖ్యమంత్రి లేదా మంత్రి.. ఎంత పెద్ద నాయకుడు అయినా ఒక కొడుక్కి తండ్రే! నాన్న అనే పదం సెంటిమెంటుతో ముడిపడినది. ఇదిగో ఇక్కడ ఈ సన్నివేశం చూశాక మరోసారి తండ్రి కొడుకుల అనుబంధం సెంటిమెంట్ గురించి చర్చ మొదలైంది. మార్క్ శంకర్ అలా తన తండ్రి పవన్ కల్యాణ్ ని పెనవేసుకుని భుజంపై నిదురిస్తున్నాడు. జరిగిన ఇన్సిడెంట్ కి అతడు ఎంతగా భయపడ్డాడో, ఎంతగా బాధను అనుభవించాడో దీనిని బట్టి అర్థం చేసుకోవొచ్చు. టాలీవుడ్ లో పవర్ స్టార్ కావొచ్చు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉప ముఖ్యమంత్రి కావొచ్చు.. దానికి మించి అతడు ఒక తండ్రి. గౌరవనీయ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన చిన్న కుమారుడు మార్క్ శంకర్ తో ఎంతగా ఎమోషనల్ గా కనెక్ట్ అయి ఉన్నారో ఒకే ఒక్క ఘటన నిరూపించింది. ఈ తీవ్ర బాధాకరమైన సంఘటన తర్వాత తన కుటుంబంతో కలిసి పవన్ కల్యాణ్ హైదరాబాద్ కు తిరిగి వచ్చారు. సింగపూర్ లోని పాఠశాలలో జరిగిన విషాదకరమైన అగ్నిప్రమాదంలో గాయపడిన అనేక మంది విద్యార్థులలో మార్క్ కూడా ఒకడు. ఈ ప్రమాదం ఒక బిడ్డ ప్రాణాలను కూడా బలిగొంది. ఈ సంఘటన ఏప్రిల్ 8న జరిగింది. సమీపంలో పనిచేస్తున్న భారతీయ పౌరులు వేగంగా స్పందించి మార్క్ సహా ఇతర పిల్లలను రక్షించారు. చాలా రోజుల ఆసుపత్రిలో చికిత్స పొందిన తర్వాత మార్క్ శంకర్ ఇప్పుడు సురక్షితంగా హైదరాబాద్ ఇంటికి తిరిగి వచ్చాడు. సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ అవుతున్న వీడియోలో పవన్ కళ్యాణ్ తన కొడుకును హైదరాబాద్ విమానాశ్రయం నుంచి ఇంటికి తీసుకువెళుతున్న దృశ్యం ప్రజల్లో భావోద్వేగాన్ని రేకెత్తిస్తోంది. మార్క్ పవన్‌లతో పాటు అతని భార్య అన్నా లెజ్నెవా, కుమార్తె పోలేనా అంజనా పవనోవా కూడా ఉన్నారు. ప్రమాదం తర్వాత మార్క్ ను సింగపూర్ లోని ఒక ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ మంచి వైద్యం లభించింది. కోలుకున్న మార్క్ తో కుటుంబమంతా హైదరాబాద్ చేరుకుంది.

# రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ కు గుణపాఠం చెప్పాలి

## జీహెచ్ఎంసీ ఎన్నికల్లో తిరస్కరించండి.. మల్కాజ్ గిరిలో కేటీఆర్



**హైదరాబాద్, మహా:** తెలంగాణ ప్రజలు రేవంత్ రెడ్డి లాంటి మోసపూరిత నేతను నమ్మిన ఫలితంగా తీవ్రంగా మోసపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మల్కాజిగిరిలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రేవంత్ రెడ్డి చెప్పిన అవాస్తవ వాగ్దానాలు, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అసంబద్ధ హామీల వలన ప్రజల జీవితాలు సంక్షోభంలో పడినట్టు పేర్కొన్నారు. ''ఒక్కసారి మోసపోతే అది మోసగాడి తప్పు, కానీ పదేపదే మోసపోతే అది మన తప్పవుతుంది. కాబట్టి ఈసారి ఎలాంటి ఎన్నిక వచ్చినా కాంగ్రెస్‌ను తిప్పికొట్టాలి'' అని ప్రజలను హెచ్చరించారు.జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పండి.''ఒకే తప్పును మళ్లీ చేయొద్దు. జీహెచ్ఎంసీతో పాటు రానున్న అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్‌ను తిరస్కరించండి'' అంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రం మొత్తం దారుణంగా వెనుకబడుతున్నా, ఒక్క రేవంత్ రెడ్డియే ఆనందంగా ఉన్నట్టు కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. ''రేవంత్ పాలన వలన మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలే అసంతృప్తిగా ఉన్నారు. ఇక ప్రజల పరిస్థితి చెప్పనవసరం లేదు. ఇది వాళ్ల విఫల పాలన ఫలితమే'' అని అన్నారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి ప్రజల మధ్య తిరుగుతూ సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి చేస్తారని కేటీఆర్ ప్రశంసించారు. ''డంపింగ్ యార్డ్ వంటి కీలక సమస్యలపై పోరాడుతున్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. మంచి నాయకుడిని గెలిపిస్తే, మంచి మార్పు సాధ్యమవుతుందని ఆయన నిరూపించారన్నారు.కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉంది.. ఎన్నిక ఏదైనా, సందర్భం ఏదైనా - ఈసారి ప్రజలు కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.






# భూభారతికి శ్రీకారం

## నేటి నుండి ప్రయోగాత్మకంగా అమలు

### మూడు మండలాల్లో పైలట్ ప్రాజెక్టు మొదలు

### రైతులకు అర్ధమయ్యే సులభమైన భాషలో పోర్టల్ ఉండాలి

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం



**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో భూభారతి పోర్టల్‌ను తొలుత ఎంపిక చేసిన మూడు మండలాల్లో ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. పోర్టల్‌పై అవగాహన కల్పించేందుకు అన్ని మండలాల్లో సదస్సులు నిర్వహించనున్నారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ఈ సేవలను విస్తరించనున్నారు. పోర్టల్‌ను సోమవారం ప్రారంభించనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. అధికారులకు దిశానిర్దేశం చేశారు. మరోవైపు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపైనా ఆయన సమీక్షించారు. భూ సమస్యల పరిష్కారం, లావాదేవీలకు చెందిన సమాచారం రైతులకు, ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేలా భూ భారతి పోర్టల్ ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. భూభారతికి చెందిన పలు అంశాలను అధికారులకు ఆయన సూచించారు. ఈ పోర్టల్‌ను పూర్తిస్థాయిలో అమలులోకి తీసుకొచ్చేందుకు రాష్ట్రంలో మూడు మండలాల్లో పైలట్ ప్రాజెక్టులుగా ఎంపిక చేసుకొని అక్కడ కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రజలకు, రైతులకు భూభారతిపై అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. ఆయా సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చే సందేహాలను నివృత్తి చేయాలో అధికారులకు సూచించారు. అదేవిధంగా ఈ భూ భారతిపై అవగాహన కల్పించేందుకు రాష్ట్రంలోని ప్రతి మండలంలోనూ కలెక్టర్ల ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహించాలని సీఎం ఆదేశించారు.

## ప్రజలకు ఈ పోర్టల్ గురించి అర్ధమయ్యేలా చెప్పండి

ప్రజలు, రైతులకు అర్ధమయ్యేలా, సులభమైన భాషలో పోర్టల్ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. పోర్టల్ బలోపేతానికి ప్రజల నుంచి వచ్చే సలహాలు, సూచనలు స్వీకరిస్తూ ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సీఎం అధికారులకు సూచించారు. వెబ్ సైట్‌తో పాటు యాప్‌ను పటిష్టంగా నిర్వహించాలని సీఎం ఆదేశించారు. ఈ సమీక్షలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శులు వి.శేషాద్రి, చంద్రశేఖర్‌రెడ్డి, సీఎం జాయింట్ సెక్రటరీ సంగీత సత్యనారాయణ, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, రెవెన్యూ కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ధరణి పోర్టల్‌పై ఎన్నికల ప్రచారంలో విమర్శలు

రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ ప్రజల పాలిట శాపంగా మారిందని, భూ లావాదేవీలన్నింటినీ ఆన్‌లైన్ ద్వారా నిర్వహించేందుకు తీసుకొచ్చిన ధరణి పోర్టల్ సామాన్య ప్రజలకు ఇబ్బందులను తెచ్చిందని ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం విమర్శలు చేసింది. భూముల వివరాలను రెవెన్యూ రికార్డుల నుంచి ధరణి పోర్టల్‌లో ఎక్కించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేసిందని ధ్వజమెత్తింది. దీంతో 20 లక్షలకు పైగా రైతులు ధరణి పోర్టల్ కారణంగా ఆగమయ్యారని ఆరోపించింది.

# ఎస్సీ వర్గీకరణకు రైట్ రైట్

## దశాబ్దాల వర్గీకరణ కల నెరవేరుస్తున్న రేవంత్ సర్కార్

### నేడే జీవో విడుదల.. ముఖ్యమంత్రికి జీవో అందజేయనున్న సబ్ కమిటీ

### మంత్రి ఉత్తమ్ సారథ్యంలోని క్యాబినెట్ సబ్‌కమిటీ తుది ఆమోదం



**మహా :** ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అమలు చేయడానికి తెలంగామ ప్రభుత్వం సిద్ధంగా ఉందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. సచివాలయంలో జరిగిన ఎస్సీ వర్గీకరణపై కేబినెట్ సబ్‌కమిటీ తుది సమావేశానికి అధ్యక్షత వహించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి, చట్టం యొక్క విధి విధానాలను వివరించే ప్రభుత్వ ఉత్తర్వు (జీఓ) అంబేద్కర్ జయంతి నాడు జారీ చేస్తామన్నారు. జీఓ మొదటి కాపీని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డికి అందజేయనున్నారు. ఏప్రిల్ 14న ఈ చట్టం అమల్లోకి రావడంతో, సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తర్వాత ఎస్సీ ఉపవర్గీకరణను అమలు చేసిన దేశంలోనే తెలంగాణ మొదటి రాష్ట్రంగా అవతరించింది.

ఉపకమిటీ సమావేశంలో వైస్ చైర్మన్ మరియు మంత్రి దామోదర్ రాజ నరసింహ, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, వన్ మ్యాన్ కమిషన్‌కు నాయకత్వం వహించిన రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్, సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, లా సెక్రటరీ తిరుపతి ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా అమలు మార్గ దర్శకాలను కమిటీ క్షుణ్ణంగా సమీక్షించి, జీఓ జారీ చేయడానికి తుది ఆమోదం తెలిపింది. షెడ్యూల్డ్ కులాలకు ప్రస్తుతం ఉన్న 15% రిజర్వేషన్ను హేతుబద్ధీకరించడం ఈ చట్టం లక్ష్యం, 59 ఎస్సీ ఉపకులాలను మూడు గ్రూపులుగా విభజించడం ద్వారా పరస్పర వెనుక బాటుతనం ఆధారంగా. గ్రూప్ Iలో 15 అత్యంత వెనుకబడిన వర్గాలు ఉన్నాయి, ఇవి ఎస్సీ జనాభాలో 3.288% ఉన్నాయి మరియు 1% రిజర్వేషన్లు కేటాయించబడ్డాయి. గ్రూప్ IIలో 18 మధ్యస్తంగా ప్రయోజనం పొందిన సంఘాలు ఉన్నాయి, ఇవి ఎస్సీ జనాభాలో 62.74% ఉన్నాయి మరియు వాటికి 9% కేటాయించబడ్డాయి. గ్రూప్ IIIలో 26 సాపేక్షంగా మెరుగైన వర్గాలున్నాయి, ఇవి SC జనాభాలో 33.963% ఉన్నాయి మరియు 5% రిజర్వేషన్లు పొందుతున్నాయి.

ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు తర్వాత అక్టోబర్ 2024లో నియమించబడిన షమీమ్ అక్తర్ కమిషన్, ఎస్సీ ఉప కులాల అంతటా సామాజికఆర్థిక సూచికలను అధ్యయనం చేసే పనిని చేపట్టింది. కమిషన్ 8,600 కంటే ఎక్కువ ప్రతిపాదనలు అందుకుంది మరియు జనాభా పంపిణీ, అక్షరాస్యత స్థాయిలు, ఉన్నత విద్య ప్రవేశాలు, ఉపాధి అవకాశాలు ఆర్థిక సహాయం మరియు రాజకీయ భాగస్వామ్యం యొక్క వివరణాత్మక విశ్లేషణను నిర్వహించింది. ప్రాథమిక సమర్పణ తర్వాత, అనేక సంఘాలు లేవనెత్తిన సందేహాలను పరిష్కరించడానికి దాని పదవీ కాలాన్ని ఒక నెల పాటు పొడిగించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దశాబ్దాల నాటి డిమాండ్‌ను నెరవేర్చిందని, అది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో లేదా తెలంగాణలో ఎప్పుడూ నెరవేరలేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గత అనేక ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా తీర్మానాలను ఆమోదించినప్పటికీ, చట్టపరమైన మద్దతుతో ఎవరూ దానిని అమలు చేయలేదన్నారు. 1999 నుండి ప్రతి అసెంబ్లీ సమావేశంలో ఈ అంశంపై చర్చించినప్పటికీ పరిష్కారం కాలేదని ఆయన గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలనే నిర్ణయానికి జాతీయ స్థాయిలో బలమైన నాయకత్వం మద్దతు ఇచ్చిందని, రాహుల్ గాంధీ తన ఎన్నికల ప్రచారంలో ఈ లక్ష్యానికి మద్దతును పునరుద్ఘాటించారు. మార్చి 18న తెలంగాణ శాసనసభ ఈ చట్టాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆ తర్వాత గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కూడా ఆమోదించారు. ఎస్సీ వర్గంలో క్రీమీలేయర్‌ను ప్రవేశపెట్టాలన్న కమిషన్ సిఫార్సును కూడా కేబినెట్ సబ్‌కమిటీ తిరస్కరించింది. ఆర్థిక ప్రమాణాల ఆధారంగా ఏ ఉపసమూహాన్ని మినహాయించకుండా సమాన ప్రయోజనాలను నిర్ధారించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న ఏ ప్రయోజనాలను నీరుగార్చబోమని, అన్ని ఎస్సీ వర్గాల హక్కులను కాపాడుతూ న్యాయాన్ని పెంపొందించడానికి వర్గీకరణ రూపొందించబడిందని ఆయన హామీ ఇచ్చారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా ఎస్సీలకు ప్రస్తుతం 15% రిజర్వేషన్లు అమలులో ఉన్నాయని, తెలంగాణలో ఎస్సీ జనాభా దాదాపు 17.5% పెరిగిందని ఆయన పేర్కొన్నారు. 2026 జనాభా లెక్కల డేటా అందుబాటులోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం రిజర్వేషన్లను పెంచే విషయాన్ని పరిశీలిస్తుందని ఆయన అన్నారు.



# సిక్కుల త్యాగం వెలకట్టలేనిది

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**మహా :** ధర్మం, దేశం కోసం త్యాగం చేసిన సమాజంగా సిక్కుల సమాజం గుర్తింపు పొందిందని బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. వారి త్యాగం వెలకట్టలేనిదన్నారు. ఆదివారం బైశాఖి దినోత్సవం సందర్భంగా అమీర్ పేట్ లోని సిక్కు సోదరుల పవిత్ర ప్రార్థన మందిరాన్ని సందర్శించి ప్రార్థనలు చేశారు. అనేక సంవత్సరాలుగా అమీర్ పేట్ లోని ఈ గురుద్వారా ప్రబంధక్ కమిటీ ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తూ తమ భక్తిని చాటుకుంటుందన్నారు. ప్రధాని మోదీ కూడా గతంలో ఈ గురుద్వారాను సందర్శించి తన భక్తిని చాటుకున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చెప్పారు.



## దేవులపల్లి రమేశ్ కు సాహిత్య శిల్పి బిరుదు ప్రధానం

**సిద్ధిపేట, నంగునూర్ ఏప్రిల్ 13:** హైదరాబాద్ త్యాగరాయ గాన సభ చిక్కడపల్లిలో రామదాసు సాహితీ కళా సేవా సంస్థ వారి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా, సాహిత్య సేవలందిస్తున్నందుకు గాను, రామదాసు సాహితీ కళాసేవ సంస్థ వారు, విశిష్ట అతిధి తేజా వత్ రామదాసు, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ,ముఖ్య అతిథి,డా.రాజగోపాల్, డా,రాధా కుసుమ, డా.దూత రామకోటేశ్వరరావు చేతుల మీదుగా నంగునూరు మండల కేంద్రానికి చెందిన, కవి రచయిత దేవులపల్లి రమేశ్ ను సాహిత్య శిల్పి బిరుదు ,తో ఘనంగా సన్మానించారు. రచయిత దేవులపల్లి రమేష్ మాట్లాడుతూ..నా సేవలను గుర్తించి సాహిత్య శిల్పి బిరుదు ఇచ్చినందుకు నాకు చాలా సంతోషంగా ఉందని మన తెలుగు భాషను కాపాడుకోవాల్సిన అవసరం మన అందరి మీద ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కవులు రామకృష్ణ చంద్రమౌళి, రవీంద్రబాబు ఆరవ,మేటూరి నారాయణరావు, భీమ శ్రీనివాసరావు,కవులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు

# బిల్డర్లకు అండగా ఉంటాం

### మరిన్ని భవనాలు నిర్మించాలి

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ



**మహా :** నిర్మాణ రంగం అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. బిల్డర్ల సమస్యలను పరిష్కరించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన చెప్పారు. బిల్డర్లకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయం చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఆదివారం నగరంలో నిర్వహించిన సైబరాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ వార్షికోత్సవానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పీఏసీ ఛైర్మన్ అరికెపూడి గాంధీ, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్ అభివృద్ధికి బిల్డర్లు కృషి చేయాలన్నారు. నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ పార్టీ ఎంతో చేసిందని ఆయన గుర్తు చేశారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు, ఔటర్ రింగ్‌రోడ్డు, కృష్ణా గోదావరి జలాల తరలింపు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయని తెలిపారు. ఈ అభివృద్ధిని ప్రభుత్వం మరింత ముందుకు తీసుకుపోతుందన్నారు. ప్రజా రవాణా కోసం మెట్రోను అభివృద్ధి చేస్తున్నామని, హైదరాబాద్‌ను మరో సిలికాన్ వ్యాలీగా తీర్చిదిద్దుతాతమని చెప్పారు. పెట్టుబడులకు అనుకూలంగా ఫోర్త్ సిటీ పేరుతో ఫ్యూచర్ సిటీని తీసుకువస్తోందన్నారు. మూసీ నదిని శుభ్రం చేసి, దాని పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. సైబరాబాద్ బిల్డర్స్ అసోసియేషన్‌కు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. బిల్డర్లకు మరింత లాభాలు వచ్చేలా చూస్తామన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని, మరిన్ని భవనాలు నిర్మించాలని ఆయన బిల్డర్లను కోరారు. ప్రభుత్వంలో బిల్డర్లు ఎప్పటికీ భాగస్వాములుగా ఉంటారని, ప్రభుత్వ అభివృద్ధిలో వారి పాత్ర ఎప్పటికీ ఉంటుందని ఆయన అన్నారు. ప్రజా ప్రభుత్వం బిల్డర్లకు వెన్నుదన్నుగా ఉంటుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కాగా, ప్రస్తుతం హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ మందగమనాన్ని ఎదుర్కొంటోందని రియల్ ఎస్టేట్ నిపుణులు చెబుతున్నారు. అధిక ధరలు, ఎన్ఆర్ఐ పెట్టుబడులు తగ్గడం, ఆర్థిక అనిశ్చితి వంటి కారణాల వల్ల అమ్మకాలు తగ్గాయని అంటున్నారు. అయితే, దీర్ఘకాలికంగా వృద్ధికి అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో బిల్డర్లకు భరోసా ఇచ్చేలా మంత్రి ఉత్తమ్ కీలక కామెంట్స్ చేశారు.

# అది అసాధ్యం

- ఈవీఎంలను ట్యాంపర్ చేయొచ్చన్నది తప్పు
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్

**మహా :** దేశంలో ఉపయోగిస్తున్న ఈవీఎంలు పూర్తిగా సురక్షితమని, వాటిని ఎవరూ ట్యాంపర్ చేయలేరని భారత చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ స్పష్టం చేశారు. ఝార్ఖండ్ పర్యటనలో ఉన్న సీఈసీ మీడియాతో మాట్లాడుతూ, యూఎస్ ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ తులసీ గబార్డ్, కాంగ్రెస్ నాయకుడు రణ్‌దీప్ సుర్జేవాలా ఈవీఎంల విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తిన నేపథ్యంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఈ విధంగా స్పందించారు. భారతదేశంలో వాడుతున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం) పూర్తిగా సురక్షితమన్నారు. ఇవి ఇంటర్నెట్, బ్లూటూత్, ఇన్‌ఫ్రారెడ్‌కి కనెక్ట్ కావన్నారు. కనుక వాటిని హ్యాక్ చేయడం, ట్యాంపర్ చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. మీరు ఓటు వేసినప్పుడు, వీవీపాట్ స్లిప్ వస్తుంది. ఇప్పటి వరకు ఈవీఎంల్లో నమోదైన ఓట్లకు, వీవీపాట్‌లో వచ్చిన స్లిప్‌లకు మధ్య ఎలాంటి తేడా కనిపించలేదని పేర్కొన్నారు. అంతేకాదు భారత ప్రజాస్వామ్య వ్యవస్థ పూర్తిగా పారదర్శకంగా, సురక్షితంగా ఉండేలా భారత ఎన్నికల సంఘం చూసుకుంటుందని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ అన్నారు.

# వాట్సాప్ ద్వారా తెలంగాణ ఇంటర్ ఫలితాలు

## ఏప్రిల్ 25న వెల్లడించే ఛాన్స్

### లేటైనా.. తప్పులకు ఆస్కారం లేకుండా రిజల్ట్



**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 202425 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ పబ్లిక్ పరీక్షలు ఇటీవల ముగిసిన సంగతి తెలిసిందే. అయితే ఈ పరీక్షల ఫలితాలు ఏప్రిల్ నెలాఖరున విడుదల కానున్నాయి. అధికారిక సమాచారం మేరకు ఏప్రిల్ 25వ తేదీన ఇంటర్ ఫలితాలను బోర్డు విడుదల చేయనుంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఒక రోజు ముందుగానే అంటే ఏప్రిల్ 24వ తేదీనే ఫలితాలు విడుదల చేయాలని ఇంటర్‌బోర్డు భావిస్తుంది. అలాగే ఈ సారి ఇంటర్ ఫలితాలను ఇంటర్మీడియట్ అధికారిక వెబ్‌సైట్‌తోపాటు వాట్సాప్ ద్వారా కూడా ఫలితాలు నేరుగా పంపించేందుకు ఇంటర్ బోర్డు ప్రయత్నాలు చేస్తోంది. ఒకవేళ ఇప్పుడు అందుబాటులోకి రాకపోయినా ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నాటికల్లా కచ్చితంగా సిద్ధం చేస్తామని బోర్డు అధికారులు అంటున్నారు. ఇప్పటికే ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం ముగిసిందని, ప్రస్తుతం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ)లో క్రోడీకరణ జరుగుతుందని, ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు వారం రోజులు పడుతుందని ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. ఒకరోజు అటుఇటుగా ఏప్రిల్ నెల నాలుగో వారంలో ఫలితాలు ఖచ్చితంగా విడుదల చేస్తామని ఆయన పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ కు బిగ్ రిలీఫ్

## వరంగల్ సభకు పోలీసుల గ్రీన్ సిగ్నల్

### హైకోర్టులో పిటిషన్ ఉపసంహరణకు బీఆర్ఎస్ నిర్ణయం

### కోర్టు నోటీసుల తర్వాత కీలక పరిణామం

**మహా :** ఈ నెల 27 న వరంగల్ లో నిర్వహించాలని భావించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఎట్టకేలకు పోలీసులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. పార్టీ రజతోత్సవ సభకు అనుమతినిస్తూ అధికారికంగా ప్రకటనను వెలువరించారు. ఇంతకు ముందు బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో బీఆర్ఎస్ నేతలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో దీనిపై విచారణ జరిపిన హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు వరంగల్ పోలీస్ కమీషనర్ కు నోటీసులు జారీ చేసింది. సభకు అనుమతిని ఎందుకు నిరాకరించారో పూర్తి వివరాలు సమర్పించాలని కోర్టు ఆదేశించింది. అంతేకాదు ఈ పిటీషన్ పై విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేసింది. ఇంకా ఈ కేసు కోర్టు పరిధిలోనే ఉంది. ఈ సమయంలో పోలీసులు సభ నిర్వహించుకోవటానికి అనుమతి ఇవ్వటంతో, బీఆర్ఎస్ నేతలు కూడా తమ పిటీషన్ ను విత్ డ్రా చేసుకున్నట్టు సమాచారం. అత్యంత ఘనంగా లక్షలాది మందితో సభ నిర్వహించి మళ్లీ ప్రజాక్షేత్రంలో దూకుడుగా వెళ్లాలని భావిస్తున్న బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి వద్ద సభను నిర్వహించడానికి పోలీసులు అనుమతి ఇవ్వటంతో సభకు మార్గం సుగమం అయ్యింది. రజతోత్సవ సభను ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న బీఆర్ఎస్ ఇక ఈ సభను బీఆర్ఎస్ చాలా ప్రతిష్టాత్మకంగా భావిస్తుంది. ఇప్పటికే మార్చి 28వ తేదీ తో పాటు, ఏప్రిల్ 4వ తేదీన రెండుసార్లు సభ అనుమతి కోసం పోలీసులకు వినతి పత్రాలు ఇచ్చి, పోలీసులు అనుమతి ఇవ్వకపోవటంతో కోర్టును ఆశ్రయించారు. ఇక కోర్టులో ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం, ప్రభుత్వానికి, వరంగల్ పోలీస్ కమీషనర్ కు పూర్తి వివరాలు సమర్పించాలని నోటీసులు ఇచ్చింది. ఈ పరిణామాల అనంతరం సభకు అనుమతి ఇస్తూ వరంగల్ సీపీ ప్రకటించారు. ఈ సభ ద్వారా గులాబీ బాస్ కేసీఆర్ మళ్ళీ ప్రజాక్షేత్రంలో అడుగు పెట్టనున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల తర్వాత నుండి మళ్ళీ ఇప్పటి వరకు ప్రజల్లోకి రాని కేసీఆర్ ఇప్పుడు ఈ సభ ద్వారా ప్రజల మద్దతు కోసం రంగంలోకి దిగనున్నారని పార్టీ వర్గాల్లో జోరుగాచర్చ మొదలైంది.

# ఫ్రూట్ జ్యూస్ తరహాలో టెట్రా ప్యాకెట్లలో మద్యం

## 60, 90, 180 ఎంఎల్ ప్యాకెట్లుగా విక్రయించాలని నిర్ణయం

### ఇప్పటికే కర్ణాటకలో అమలు.. తొలుత మహబూబ్‌నగర్ జిల్లాలో విక్రయాలు

### ప్రభుత్వంతో మెక్‌డొవెల్స్ కంపెనీ మంతనాలు




**హైదరాబాద్, మహా:** తెలంగాణలో త్వరలో టెట్రా ప్యాకెట్లలో మద్యం అందుబాటులోకి రాబోతోంది. ఇప్పటికే కర్ణాటకలో ఈ తరహాలో మద్యం విక్రయిస్తున్నారు. ఫ్రూట్ జ్యూస్ తరహాలో మద్యం ప్యాకెట్లను 60 ఎంఎల్, 90 ఎంఎల్, 180 ఎంఎల్ ప్యాకెట్లను అమ్మేందుకు రెడీ అవుతున్నారు. సీసాల్లో దొరుకుతున్న మద్యం కంటే టెట్రా ప్యాకెట్ల ధర తక్కువగా ఉండనుంది. ప్రస్తుతం క్వార్టర్ చీప్ లిక్కర్ ధర రూ. 120గా ఉండగా, టెట్రా ప్యాకెట్లలో అది రూ. 100కే లభించే అవకాశం ఉంది. ప్రభుత్వం ఆమోదం తెలిపిన వెంటనే టెట్రా ప్యాకెట్లలో మద్యం అందుబాటులోకి రానుంది. కర్ణాటకలో మెక్‌డొవెల్స్ నంబర్ వన్ కంపెనీ 90 శాతం టెట్రా ప్యాకెట్లలోనే మద్యం విక్రయాలు జరుపుతోంది. రాష్ట్రంలోనూ అదే తరహాలో విక్రయానికి ముందుకొచ్చింది. ఇందుకోసం ఆ కంపెనీ ప్రతినిధులు రెండుసార్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులను కలిసి టెట్రా ప్యాకెట్ల వల్ల ఖర్చు తగ్గడంతోపాటు ప్రభుత్వానికి, వినియోగదారుడు, కంపెనీకి కలిగే ప్రయోజనాలను వివరించారు. టెట్రా ప్యాకెట్లపై ప్రజల్లో స్పందన ఎలా ఉందో తెలుసుకునేందుకు తొలుత మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రయోగాత్మకంగా ఈ టెట్రా ప్యాకెట్లను విక్రయించాలన్న చర్చ కూడా తెరపైకి వచ్చినట్టు తెలిసింది. కాగా, తెలంగాణలో మొత్తం 2,620 వైన్ షాపులు, 1,117 వరకు బార్లు ఉన్నాయి. వీటికి దేశ విదేశాలకు చెందిన 55 కంపెనీల ద్వారా మద్యం సరఫరా అవుతోంది.

మహా పత్రిక
ANN తెలుగు
సోమవారం, హైదరాబాద్ | 14-04-2025


# గాయం మీది పేలిక గాలికి నిలవడం లేదు

దర్ద్, దవా, దక్కా, దాహం
ఇవన్నీ, దగా పడిన వాళ్లకే తెలుసు !

నీవు విసిరిన ఖంజర్ యెంత పదునో
గాయపడిన నాకే తెలుసు !

బాధా, గుక్క, నొప్పి, చాలా వుంది
అది గుండె పగిలిన వాళ్లకే తెలుసు !

నిర్దయగా దెబ్బ కొట్టిన వాడు నవ్వుతున్నాడు
వాడు పావురాల మెడలకు గజ్జెలు కట్టి
ప్రాణాలు తీయడం తెలిసిన వాడు

మనసుకు దర్ద్, దయా, తెలియని వాడు
సెల్ఫీ తీసుకొంటూ నవ్వు తున్నాడు

వాళ్లందర్నీ చూసి, దుఃఖం మోసే వాడు కూడా,
వెక్కి వెక్కి నవ్వు తున్నాడు !

కొందరు ఆగి ఆగి వెళ్లారు
ప్రేమ కలుగలేదు, పలకరించలేదు
కొందరు చూసి చూసి వెళ్లారు

చూసే చూపుకు తగలలేదు, అక్కడ ఆగలేదు

గాయం మీది మరకలంటిన పేలిక
గాలికి నిలువడం లేదు
మనుషుల మనసు కబ్రస్తాన్ కాకూడదు

ఇన్ని దెబ్బల మధ్యన సంభాలించుకొని
పిచ్చితో, ప్రేమతో, పూల మొక్కలు
నాటు తున్నాను



- ఆశారాజు

# తావులేని ఒంటరితనం!

ప్రకృతిలో
ఏవీ ఒంటరిగా లేవు
కలిసిమెలసే ఉన్నాయి!

నీటిని ఎడబాసిన మొక్క
నిలువునా ఎండిపోతది!

అందరినీ కాదనీ
ఎవరు మాత్రం
వైభవాలను అనుభవిస్తారు?!

వ్యక్తం చేయడానికి
ఎన్ని ఉపకరణాలున్నా
వినడానికో తోడు ఉండొద్దు?!

సాకులెన్ని చెప్పినా

సహిష్ణుత కొరవడితే
అల్లకల్లోలం తప్ప మరోటి
మిగలదు!

మనిషంటేనే
మిగతా ప్రాణులకంటే భిన్నం
భిన్నత్వమే సౌందర్యం!!



- కోట్ల వెంకటేశ్వర రెడ్డి,
9440233261

# ఈ చేదు కొంచెం సేపే...

అటూ ఇటూ ఊగుతూఊగుతూ తెగడానికి క్షణాలు
లెక్కిస్తున్న ఆ చూపుల తీగలకుతెలుసు
గాలిలో ఆడుతూ ఆడుతూ నడుస్తూ నడుస్తూ దాహపు
గూడాలను గెలిచీగెలిచీ
అలసిన పాదాలకు అరిగిన పాదరక్షలకూ తెలుసు
అన్నపూర్ణ దేశంలో
ఇంద్ర భవనాలు చంద్రశాలల్ని తలదన్నే శిఖరాలపై
సంపన్నులున్న నేలలో కదలి కదలకుండా ఒరిగి పోయిన
నీ శరీరం
శవాలు మోసిన గంగానదిని చివరి
చూపుచూస్తున్నట్లున్నది.
నోట్ల నూకలువెదజల్లి ఓట్ల పావురాలనులను వేటాడిన
నేతలకేం తెలుసు కోట్లాది గొంతులు వెదజల్లే సుజలాం
సుఫలాం దేశభక్తి గీతం.
నీకు మాత్రం బతుకు బరోసా ఇవ్వని రాగమైంది.
కాలం ఎవ్వరినీ పక్షపాతంతో దాటెయ్యనట్లు గాయపడ్డ
నీ కాళ్ళని జాలితో పలుకరించిందే తప్ప పూల దారుల

ఊసులు ఒక్కటీ చెప్పి పోలేదు
ఎవరు లేకుంటే ఏం ఈ ఆకుపచ్చని గొడుగుంది కదా
విపత్తు తుఫాను తరుముకొస్తున్నదని జీవితాన్ని చీకటి
గోతిలోకి విసిరేయకు
ఆ చెట్టు నీకోసమే ఒంటరిని భరించి నిలుచుంది
తుఫానులు,జడివానలు,ఓర్చుకునిబతుకు
తియ్యదనాన్ని నీ దోసిట్లో నింపడానికే...



- డా.ఉదారి నారాయణ,
9441413666

రచనలకు ఆహ్వానం
సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు,
పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

పుస్తక సమీక్షల కోసం...
తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ
దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.

# వస్తు వైవిధ్యం.. కథన భిన్నత్వం

కథకు వస్తువు ముఖ్యమా? శిల్పం ముఖ్యమా? అన్నది సందిగ్ధమే. అయితే కథా వస్తువు, శిల్పం రెండూ రచయిత ప్రతిభ మీద ఆధారపడి ఉంటాయి. ఆ రచయిత తన కాలం నాటి ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితుల ప్రభావంతోనే రచనను సృష్టిస్తాడు. వైయక్తిక స్వేచ్ఛ చెలామణిలో ఉన్న నేటి రోజుల్లో ప్రపంచగమనాన్ని సమాచార, సాంకేతిక, వ్యాపారాలు నిర్దేశిస్తున్నాయి. పల్లె నుంచి అంతరిక్షం వరకూ మనిషి ప్రపంచీకరణ వలలో చిక్కుకుని తనను తాను వస్తువుగానే భావించుకుంటున్నాడు. కులం, మతం, ప్రాంతం, లింగం, డబ్బు మానవ సంబంధాలకు, మనుషుల విలువలకు కొలమానాలుగా మారిన సందర్భంలో కథా వస్తువుకు కొదవ లేదు. కథనానికీ పరిమితుల్లేవు. ఈ నేపథ్యంలోంచే పాణిని జన్నాభట్ల మనిషి సహజ అసహజ స్వభావాల్ని, చర్యా ప్రతిచర్యలను, అంతర్ బహిర్ కోణాలను, చేతన అచేతనలను కథలుగా మలుస్తున్నారు. వీరి "చెయ్యాల్సిన పని" కథా సంపుటే ఇందుకు సాక్ష్యం.




పదిహేను కథలున్న ఈ పుస్తకంలోని కథలు వాస్తవాన్ని నేరుగా లేదా అన్యాపదేశంగా, సంక్లిష్టతల్లోంచి సహేతుకమైన తీర్పునిస్తున్నాయి. అసమర్థుడిని గెలుపువైపు నడపటం పర్సనాలిటీ డెవలెప్ మెంట్ లోని సూత్రం. ఈ సూత్రాన్ని దినచర్యా కథనంతో పలు సంఘటనల్లో చెప్తుంది "చెయ్యాల్సిన పని" కథ. భార్య వదిలేసిన భర్త ఉదయం 9:00 గం. నుంచి రాత్రి 8:00 గం. వరకు చెయ్యాలని రాసుకున్న పనుల్లో ఒక్కటీ చెయ్యలేడు. కానీ చివరకు తండ్రిని రైలు కిందకు నెట్టి చంపేటప్పుడు "చెత్తనా కొడకా! సంపీ, సచ్చీ కాదురా సాదించేది, అదేదో బతికి, ధైర్యంగా బతికి సాదించు" అన్న మాటలతో ధైర్యంగా తను వద్దనుకున్న సమాజం వైపు అడుగు లేస్తాడు. కథ ప్రారంభంలోనే పాత్ర చెయ్యాల్సిన పనులు చెప్పి, చెయ్యలేక పోవడానికి కారణాలు చూపుతూ, పాత్రను అంతర్గతంగా విశ్లేషించడం దీనిలోని ప్రత్యేకత. పాత్ర స్వభావాన్ని మార్చేయడం కొసమెరుపు.

"రైటర్స్ బ్లాక్" కథ "నిద్ర లేచి మరోసారి చనిపోయాన్నేను" అని ప్రారంభమవుతుంది. అలా చనిపోవడానికి గల కారణం ప్రధాన పాత్రైన రచయితే చెప్తూ "నా రాతలు వేరు, నేను వేరు. రచయితగా బతుకుతూ, మనిషిగా పతనమవడం. రెండిటిలోనూ ఏకసూత్రంగా బతకడానికి నేనేమైనా చలాన్నా? తెలివైనవాణ్ణి" అని వివరణ ఇస్తుంది. అయితే, అతడిలో మంచితనం మాటున దాగిన స్వార్థాన్ని, అపజయాల్ని ఎదుర్కోలేని విజయమనే మత్తుని, జెలసీతో నిండిన అహంకారపు రైటర్ మనోలోతుల్ని, క్రూరపు చూపుల్లో దాగిన కాముకత్వాన్ని రీల్స్ చేసే ఎదురింటి అమ్మాయి "అంకుల్! సన్ గ్లాసెస్ పెట్టుకుని వీడియో తియ్యి" అన్న మాటలు బద్దలు కొడతాయి. ముసుగేసుకున్న అతని చూపుల వ్యభిచారాన్ని బట్టబయలు చేస్తాయి. దాంతో అతను రైటర్ గా పునర్జన్మ ఎత్తుతాడు. రచయిత పరివర్తనలోని ముందువెనుకలను ఎత్తుగడ, ముగింపులతో సూచించే ఈ కథ చైతన్యస్రవంతి, సాధారణ శైలుల మిశ్రమంగా సాగి పాఠకుడ్ని కొద్దిగా ఇబ్బందికి గురిచేస్తుంది. అయినా గాఢతతో అనుభూతిని, నిజాయితీగా బతకాలన్న నిజాన్ని వెల్లడిస్తుంది.

సంభాషణాత్మక కథనంతో నిండిన కథ "పది వోడ్కా షాట్లు". ఒకే సన్నివేశంలో ప్రధాన పాత్రతో మిగిలిన పాత్రలు జరిపే సంభాషణలోనే ఆ పాత్ర వ్యక్తిత్వం, ప్రవర్తన, ఆ ప్రవర్తన వెనకున్న ఉద్దేశ్యం వెల్లడవుతాయి. చివరిలో నేరుగా బెడ్ రూమ్ లోకి వెళ్లబోతే, అతడి భార్య గ్రే గూస్ వోడ్కా తెచ్చి... .... "కనీసం పది వోడ్కా షాట్లేసుకున్నాకే రా... వెళ్లు, నిన్ను నువ్వు పోగొట్టుకున్నాకే రా..." అంటుంది. మనిషి మద్యం తాగితే తన ఒరిజినాలిటీని పోగొట్టుకుంటాడన్న నిజాన్ని తలకిందులు చేస్తూ, మనిషి నటనతోనే బతుకుతున్నప్పుడు ఒరిజినాలిటీ కోసం మద్యం తాగాలని నేరుగా చెప్తుందీ కథ. కోరికలు, హోదా, అధికారం, మనీ కోసం ఇచ్చే పార్టీ కల్చర్ ను నగ్నంగా చూపించే ఈ కథలో "నవ్వులు చుట్టూ. కొన్ని పళ్లతో, కొన్ని కళ్లతో. లక్షలు ఖర్చు పెట్టి తిట్టించుకున్నాను. థూ", "ముఖ్యంగా ఆమె ముఖంలో నవ్వు... ఇన్వెస్ట్ మెంట్!", "వాడుకోవడం ఈస్ నాట్ ఆల్వేస్ ఈక్వల్ టూ ఆడుకోబడటం" వంటి వాక్యాలన్నీ పాత్రని, పార్టీలు జరగే తీరును, వాటి వెనకున్న రహస్యాలను కళ్లముందు నిలబెడతాయి.

కథనే హాస్యంగా అల్లడం "సర్వనామ ఫ్యామిలీ"లో కనిపిస్తుంది. ప్రధాన పాత్ర వారసత్వంగా సర్వనామాల్ని బతకించుకోవాలని తపిస్తుంది. టెన్త్ హిస్టరీ పరీక్షలో "ఆ సంవత్సరంలో వాళ్ల దేశం నుండి వేల మంది వీళ్లతో యుద్ధానికొస్తే, ఇక్కడున్న వాడు కొన్ని లక్షల వీళ్లని, కొన్ని వేల వాటిని తీసుకొని ఎదుర్కొన్నాడు...." అని రాశానని చెప్తూ... కథలో వాడు, వీడు, వాళ్లు, వీళ్లు, ఒకడు, అతడు, ఆమె, ఇతడు, ఈమె, ఇది, అది... వంటి సర్వనామాలతోనే నడుస్తుంది. "సర్వనామజనాః సుఖినో భవన్తు.." అని ముగిసి నవ్వులు కురిపిస్తుంది.

పురాణాలు, ఇతిహాసాలను, పాత్రలను వర్తమాన పరిస్థితులు, ఆలోచనలు ప్రతిబింబించేలా మార్చడం సాహిత్యంలో కొత్తేం కాదు. కానీ కథా శిల్పానికి నాటక శిల్పాన్ని జోడించి చూపడం తక్కువమంది చేసిన ప్రయోగం. "ఈమె కదా యాజ్ఞసేని?" కథలో రచయిత ద్రౌపదిలోని పరాక్రమాన్ని, నాయకత్వాన్ని, పౌరుషాన్ని, యుద్ధశక్తిని, సౌమ్యతను చూపించాడు. ముగింపులో తన కురుల్ని పట్టిలాగిన దుశ్శాసనుడి తల నరికి చంపేలా చిత్రించాడు. కథ జరిగే సంఘటనా స్థలాలు, వర్ణనలు. వేషధారణలు, సంభాషణలు... తిక్కన నాటకీయ శిల్పంలో చూపినట్లు, కథలో రాశాడు ఈ రచయిత.

మనిషిలోని కసిని, కోపాన్ని, ఆవేదనను ప్రతీకార చర్యలుగా చూపే కథ "అసంకల్పిత ప్రతీకారాలు". ప్రకృతిలోని చర్యకు, ప్రతిచర్య ఉంటుంది. కానీ మనిషి ఆలోచించి, తనను తాను అణచుకుని, ప్రతిచర్యకు పాల్పడడు. ఇదో సైకాలజీ థియరీ. కానీ ఇందులోని పాత్ర ప్రతీకారాన్ని భౌతికంగా తీర్చుకుంటూ, కారణాలను జ్ఞాపకాలను నెమరువేసుకుంటుంది. "నా జ్ఞాపకాలే నా నిజాలు. ఓ సారి అవి నా కవచాలు, మరోసారి ఆయుధాలు, పరిస్థితి చెయ్యి దాటుతుంటే కొత్త ఆయుధాల్ని సృష్టించే కర్మాగారాలు!" అని ఆ పాత్రే అంటుంది. అంతరంగానికి ముసుగు తొలగిస్తే మనిషి చర్యలు ఎలా ఉంటాయో ఉత్తమ పురుషలో ప్రధాన పాత్ర చెప్పడం దీనిలో గమనించవచ్చు.



- డా. ఎ. రవీంద్రబాబు
8008636981

"అంతర్థానం" కథ యాక్సిడెంట్ లో చనిపోయిన భార్య పరిస్థితిని, మనసును, ఇంటిని మధ్యమ పురుషలో ఉద్వేగభరితంగా చూపిస్తుంది. "లింబో" ఒకే విషయాన్ని భిన్నపాత్రల దృక్కోణాలతో వివరిస్తుంది. "విషం దేవుడు", "ఆఖరి గోడ"లు కొంత మ్యాజిక్ రియలిజం టెక్నిక్ తో నడుస్తాయి. భవిష్యత్తులో రోబోలు మనుగడ కోసం పోరాటం చేయక తప్పదంటుంది "ఆమరణ నిర్విద్యుత్ దీక్ష". మిగిలిన కథలూ వస్తువు, కథన పరంగా ఆకట్టుకుంటున్నాయి. ఎక్కువ కథలు ఏకపాత్ర ప్రాధాన్యతతో ఏకోన్ముఖ, బహుముఖంగా సాగుతూ, సంఘర్షణ పడుతూ, వైవిధ్యంతో, వైరుధ్యంతో, ద్విదీభావంతో కనిపిస్తున్నాయి. పాత్ర మనఃసంచలనాలు, సంవేదనలు, సంక్లిష్టతలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాదు, వాటిని ప్రభావితం చేసే సమాజ పోకడలనూ జన్నాభట్ల అంతర్లీనంగా చూపించాడు. వీరిలో సమాజాన్ని బూతద్దంలో, బూతద్దంలోంచి సమాజాన్ని చూడగల సూక్ష్మగ్రాహ్యతా ఉంది. అయితే, కథే పాఠకుల్ని ఎంచుకుంటుంది అన్న నియమం ప్రకారం కథనాన్ని, వస్తువును బ్యాలెన్స్ చేసి, పాఠకుల్ని నిర్ణయించుకోవటంలో ఇంకొంత నేర్పు అవసరమేమో అనిపిస్తుంది.

**ప్రతుల కోసం:**
**చెయ్యాల్సిన పని (కథలు)**
**రచయిత: పాణిని జన్నాభట్ల**
**పేజీలు: 155. వెల: 175 రూపాయలు**
**9705972222, 9849888773**

# జీవన సంఘర్షణకు ప్రతిరూపం అనాహత కవిత్వం

అమానవీయమైన సమాజంలోని సామాన్యుల దుస్థితిని కవిత్వాక్షరాల్లో వ్యక్తీకరించడం రవీంద్రసూరి నామాల ప్రత్యేకత. నలభై ఏడు పదునైన కవితలతో కూడిన కవితా సంపుటి 'అనాహత'. తన చుట్టు జరుగుతున్న అన్యాయాల మీద, అధర్మాల మీద, అత్యాచారాల మీద, అవినీతి మీద స్పందించ లేకుండా ఉండలేకపోయారు. ఎంచుకున్న కవితా వస్తువులో తీవ్రమైన స్వరాన్ని నామాల వినిపించారు. ' అనాహత ' అంటే ఏమిటి? దీనికి సమాధానం ఈ కవితా సంపుటికి ముందుమాట రాసిన ప్రసిద్ధ సినీగేయకవి, రచయిత మౌనశ్రీ మల్లిక్ గారు ఈ విధంగా వివరించారు. 'అనాహత అంటే తగలకుండా వచ్చే శబ్దం. మామూలుగా శబ్దం రావాలంటే రెండు వస్తువులు ఒకదానికొకటి తగలాలి.అలా తగలకుండా వచ్చే శబ్దమే అనాహత. ఇది మన నిమ్న చక్రాలకీ, ఉన్నత చక్రాలకీ ఇంకా మనుగడ ప్రవృత్తులకీ ఆత్మ విమోచనగా అంతఃప్రేరణకి మధ్య పరివర్తన స్థానం. ఇది అనాహత అర్థం.' అందుకనే 'అనాహత' కవితలోని విషయం మనకు నేరుగా బోధపడుతుంది. మనుషులు వాస్తవంలో కంటే అవాస్తవాల్లోనే ఎక్కువగా జీవిస్తున్నారని ఆవేదన చెందుతున్నారు కవి. 'నిజాలు బుతువుల్లాంటి /ఇజాలకు భయపడి మారుతుంటాయి' అని కలతచెందుతున్నారు కవి. శబ్దం రాకుండానే మనిషి జీవితం విచ్ఛిన్నమౌతున్న తీరును ఈ కవితా పాదాల్లో చూడవచ్చును. మనసున్న మానవుల కోసమే ఈ కవి తండ్లాటని మనకు అర్థమవుతుంది.

**'చట్టానికి న్యాయం, అన్యాయం**
**/రెండు సమానమే**
**అన్యాయం గెలిచిన ప్రతిసారి**
**న్యాయం కొత్త ఆలోచన చేస్తూనే ఉంటుంది**
**మనిషి చూడాల్సింది/గెలిచామని కేకలు పెట్టున్న**
**అన్యాయపు నీడల్ని కాదు/ వెతకాల్సింది**
**అన్యాయపు అరుపుల మధ్య ఇరుక్కున్న**
**ఎరుపెక్కిన న్యాయాన్ని'**

అణచివేతకు బలైపోతున్న మహిళల పట్ల ఈ కవికి అంతులేని దు:ఖమున్నది. అన్ని రంగాలలో మహిళలు సమానమైన హోదాను పొందాలని ఆశిస్తున్నారు. స్త్రీలు లేనిదే ఈ సభ్యసమాజం లేదని, పునీతులు కావాల్సింది స్త్రీలు కాదు పురుషులు కావాలని అంటున్నారు కవి. ఆమె బాధల పట్ల సానుభూతి కాదు నిజమైన చేయూతనివ్వాలని ఈ కవితా చరణాల ద్వారా పిలుపునిస్తున్నాడు నామాల.




**'చేప దు:ఖం/ సముద్రానికి తెలియనట్లుగా**
**స్త్రీ దు:ఖం సైతం/ జన సముద్రానికి పట్టదు**
**ఇంకా స్త్రీ ఎన్ని కన్నీళ్ళు కారిస్తే**
**అందులో బాధల తర్పణలు అర్పిస్తే**
**పునీతుడవుతాడో కదా పురుషుడు'**

ఏదో మొక్కుబడిగా కాకుండా ఒక ఆశయంతో మనిషి మనుగడ ఉండాలని భావించడంలో ఎలాంటి సందేహం లేదు. అదృష్టాలను నమ్ముకుని, ఆయాచితమైన ఆస్తులు కలిసివస్తాయానే భ్రమల్లో బతుకుతున్న వాళ్ళను చూసి జాలిపడుతున్నారు కవి. నమ్ముకున్న వాళ్ళు మోసం చేయడంలో వెనుకాడకపోవడం భరింపరాని వేదనను కలిగిస్తున్నదని తన కవితల ద్వారా వ్యక్తం చేస్తున్నాడు కవి. గమ్యాన్ని సాధించడంలో ఎదురయ్యే సవాళ్ళను స్వీకరించి జీవితాన్ని ఫలవంతం చేసుకోవాలి కానీ అక్రమమైన పద్ధతులను పాటించవద్దని చెప్పిన కవిత 'బతకడంజీవించడం'. ఈ రెండింటి మధ్యన ఉన్న తేడాను సోదహరణంగా వివరించారు. కష్టంతోనే జీవితాన్ని ఇష్టంగా నిర్మించుకోవాలని ఈ కవితను చదివితే మనకు అవగతమవుతుంది.

**'మనుషులు ఉభయచరాలే**
**మోసేయగలరు/ముంచేయగలరు**
**నేను నా అరచేతి వంకరగీతలను**
**నమ్ముకున్న జాతక ప్రేమికుడ్ని కాదు**
**ముడులేసుకున్న మెదడు పొరల అరల్లో**
**మానవ సాహిత్యాన్ని ముద్రించడం కోసం**
**బయలుదేరిన నిరంతర శ్రామికుడ్ని**
**నేను ఊహించినట్లుగానే జీవిస్తున్నా**
**ఊహల్లో బతకడం లేదు'**

భారతీయ సమాజాన్ని చెక్కుచెదరకుండా నిలబెట్టింది కుటుంబం. రక్త సంబంధికుల మధ్యనుండే అనుబంధాలకు నిజమైన చిరునామా కుటుంబం. అట్లాంటి కుటుంబంలో పెద్దోడికి, చిన్నోడికి మధ్యన ఉండే 'నడిపోడు' గూర్చి అద్భుతమైన కవితను రాశారు నామాల. 'నడిపోడు' పేరు ఒక దీర్ఘకావ్యాన్ని కూడా త్వరలో వెలువరిస్తూన్నారు. అందులో నుంచి ఒక భాగానికి ఈ కవితా సంపుటిలో చేర్చారు. కుటుంబ నిర్వహణలో నడిపోని పాత్ర గూర్చి ఈ కవితా పాదాల్లో ఇలా వ్యక్తం చేశారు కవి.

'తల్లిదండ్రుల దు:ఖం/ప్రతి కొడుకుని యోధుణ్ణి చేస్తుంది. యోధుడు వచ్చే సమయం/ఆకాశాన్ని చీల్చుకుంటూ ఇంట్లోకి/సూరీడు పొద్దె పొడుచుకొచ్చాడు/ మధ్య తరగతి కుటుంబాల్లో/కష్టాలు కన్నీళ్లు కవల పిల్లలై/ నిత్యం మనుషులతో సావాసం చేస్తుంటాయి/బాధలకు బంధాలకు/వంతెనలు పుట్టుకొస్తాయి/విశాలమైన వంతెనపై/కడకు కడకు తిరుగుతూ/కడక్గా ఉంటారే తప్ప/ఒక్కరూ అడుగులు ముందుకెయ్యరే/నడిపోడే వంతెన అవుతాడు/అందరి వంతూ తనపై వేసుకుంటాడు అప్పుడు/ఇక్కట్లు పక్కకు తప్పుకుంటాయి/చీకట్లు తొలగిపోతాయి'. ఇంట్లో జరిగే ఏ శుభకార్యమైన కానీ నడిపోని చేయుతలేనిది జరగదంటాడు కవి. ఇంకా ఈ కవితలోని ఈ పాదాలు మనల్ని ఎంతగానో ఆకట్టుకుంటాయి. 'బాధ్యత తెలిసినవారే/బరువులు ఎత్తుకుంటారు. చెట్టుకు అంటు కట్టినట్లుగా/బంధాలకు అంటుకడుతుంటాడు తను/ఎప్పుడూ అందరితో ఉంటాడు/అందరిలో ఉంటాడు/అందరివాడతడు/నడిపోడొక సమూహ చైతన్యం'. అభివృద్ధి పేరుతో జరుగుతున్న ప్రకృతి విధ్వంసం వల్ల మానవులకే కాదు ఇతర జీవజాలం కూడా కానరాకుండా పోయినా విధానాన్ని 'జీవవైవిధ్యం' కవితలో ఆవేదనాభరితంగా వ్యక్తం చేశారు కవి. గ్రామాల్లో కనిపించే అచ్చమైన సంప్రదాయాలు లేకుండాపోయాయి. వివిధ రకాలైన పక్షులు అందరించిపోతున్నాయి. కొన్నింటిని బొమ్మల్లోనే చూసుకోవల్సిన దుస్థితికి మనమంతా చేరుకున్నాం. కవి రాసిన ఈ వాక్యాల్లోని భావాలతో ఏకీభవించకుండా ఉండలేము.

**'గతం పునాదులపై/భవిష్యత్ నిర్మించుకోవాలి**
**కచ్చరం కన్పిస్తోందా/ఉసిల్ల ఊసైనా ఉందా**
**గీసకత్తి మొక్కబోయింది/కుమ్మరాము**
**కనుమరుగైంది**
**మోటబావి చెరువుతూము**
**ఛిద్రమైన పల్లెటూరిసంస్కృతి**
**పాలపిట్ట శమరకాకి/లింగన పురుగు కుమ్మరి**
**పురుగు**
**తుమ్మిష్క భూం పాప/ఎర్రలు**
**తేనెటీగలు బుడ్డుంగలు**
**పక్షులతో నూటొక్క ఉపయోగాలు**

జీవాల్ని పోగొట్టుకొని/జీవవైవిధ్యాన్ని వెతుక్కంటున్నాం' మానవజీవితంలోని సంఘర్షణ, వ్యవస్థలోని అసమానతల గూర్చిన వ్యక్తం చేసిన కవిత్వానికి 'అనాహత' కవితా సంపుటి నిదర్శనంగా ఉన్నది. రవీంద్ర సూరి స్వేచ్ఛాయుతమైన భావాలను అస్వాదిద్దాం. కవి మిత్రునికి అభినందనలు.



- గోపగాని రవీందర్,
9440979882

మహా పత్రిక
ANN తెలుగు
సోమవారం, హైదరాబాద్ | 14-04-2025
WWW.MAHAADAILY.COM






# అన్నదాత ధీమా

# భూ భారతి

## నూతన చట్టం.. చిక్కులకు పరిష్కారం

## ముఖ్యమంత్రి రేవంత్ పట్టుదల

## మంత్రి పొంగులేటి కార్యాచరణ

## ధరణికి బై.. భూ భారతితోనే ఇక హాయ్

**ఖమ్మం మహా:** తెలంగాణలో భూ సమస్యల చరిత్ర ఎన్నో వందల ఏళ్లనాటి పాతగాథ. పట్టా లేకుండా వందల మంది రైతులు, ధరణిలో లోపాలతో అటకెక్కిన పత్రాలు, విరాసత సమస్యలు, అసైన్డ్ భూముల అనిశ్చితి, భూముల రిజిస్ట్రేషన్ తరువాత మ్యుటేషన్ కష్టాలు —— ఇవన్నీ గత పది సంవత్సరాల్లో రైతన్నకు భారంగా మారిన పరిస్థితులు. ఈ లోపాలన్నింటినీ గుర్తించి, సాంకేతికతతో విలీనంగా, రైతుకు మేలు చేసే దిశగా 'భూభారతి చట్టం- 2025' రూపుదిద్దుకుంది. ఈ చట్టం ద్వారా జిల్లా స్థాయి ట్రైబ్యునల్స్ ఏర్పాటవడం, పాత విధానాల మార్పు, సులభతరం రెవెన్యూ సేవలు, జిపి వివో వ్యవస్థ, భూధార్ కార్డు వంటి మార్పులు అమలవుతాయి. ఈ చట్టాన్ని మనం పూర్తిగా అర్థం చేసుకోవాలంటే —— ప్రశ్న-జవాబు రూపంలో వివరించడం అత్యంత ఉపయుక్తం.

**భూభారతి చట్టం 2025 – 50 ప్రశ్నలు , విస్తృత జవాబులు**

**1. భూభారతి చట్టం అంటే ఏమిటి?**

**జవాబు:** భూభారతి చట్టం 2025 అనేది తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన సమగ్ర భూ పరిపాలన చట్టం. ఇది ధరణి లోపాలను సరిదిద్దుతూ, భూముల నమోదు, రికార్డు నిర్వహణ, హక్కుల పరిరక్షణ, భూ వివాదాల పరిష్కారం వంటి అంశాలలో రైతులకు న్యాయం చేసేందుకు తీసుకొచ్చిన నూతన చట్టం.

**2. ధరణి, భూభారతి మధ్య తేడా ఏమిటి?**

**జవాబు:** ధరణి పోర్టల్‌లో ఉన్న మాడ్యూళ్లు ఎక్కువగా ఉండటం, రైతులకి సేవలు ఆలస్యం కావడం ప్రధాన సమస్య. భూభారతి చట్టంలో కేవలం ఆరు మాడ్యూళ్లు మాత్రమే ఉండి, మరింత సులభతరంగా సేవలు లభించేందుకు మార్పులు చేసారు. ఇందులో భూధార్, గ్రామ పరిపాలన అధికారులు, ట్రైబ్యునల్‌లు వంటి పద్ధతులు కొత్తగా వచ్చాయి.

**3. ఈ చట్టం ఎప్పుడు అమలులోకి వచ్చింది?**

జవాబు: భూభారతి చట్టాన్ని 2025 ఏప్రిల్ 14న బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా అధికారికంగా అమలులోకి తెచ్చారు. ఇది రైతులకు నూతన భూ హక్కుల చరిత్రలో మైలురాయి.

**4. ఈ చట్టంలో ముఖ్యమైన లక్ష్యాలు ఏమిటి?**

జవాబు: రైతులకు భూహక్కుల రక్షణ, వివాదాలకు త్వరిత పరిష్కారం, భూములకు భద్రత కల్పించడం, రికార్డుల పారదర్శకత, ఆధునికీకరణ, అసైన్డ్ భూములకు పాస్‌బుక్‌ల జారీ ప్రధాన లక్ష్యాలు.

**5. భూధార్ అంటే ఏమిటి?**

జవాబు: భూముల కోసం ప్రత్యేకంగా ఇచ్చే గుర్తింపు నంబర్‌ను భూధార్ అంటారు. ఇది భూమికి ఆధార్ లాంటి గుర్తింపు కార్డు. భూమిని గుర్తించేందుకు ఇది అత్యంత కీలకం.

**6. జిపి వివో అంటే ఎవరు?**

జవాబు: జి పి వి ఓ అంటే గ్రామ పాలనాధికారి. వీరు గ్రామస్థాయిలో రెవెన్యూ సేవలు అందించే నూతన అధికారులు. గ్రామస్తుల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించడమే వీరి విధి.

**7. గ్రామ పరిపాలన అధికారులను ఎంతమందిని నియమిస్తారు.**

జవాబు: రాష్ట్ర వ్యాప్తంగా 10,954 గ్రామ పాలనాధికారులను నియమించారు. వీరే భూభారతి అమలు శక్తిగా మారనున్నారు.

**8. భూ వివాదాలను ఇకపై ఎక్కడ పరిష్కరిస్తారు?**

**జవాబు:** కోర్టులకు వెళ్లకుండా జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన ట్రైబ్యునల్‌ల ద్వారా భూ వివాదాలను పరిష్కరిస్తారు.

**9. ట్రైబ్యునల్‌లో ఎవరెవరు ఉంటారు?**

**జవాబు:** ట్రైబ్యునల్‌లో కలెక్టర్ ఆధ్వర్యంలో రెవెన్యూ, న్యాయ, సాంకేతిక నిపుణులు సభ్యులుగా ఉంటారు. వీరు స్పష్టమైన విచారణ తర్వాత తీర్పులు ఇస్తారు.

**10. అసైన్డ్ భూములకు పాస్‌పుస్తకం వస్తుందా?**

**జవాబు:** అవును. ఆర్డీవో స్థాయిలో విచారణ అనంతరం చట్టబద్ధంగా పాస్‌పుస్తకాలు జారీ చేయబడతాయి.

**11. భూముల మ్యుటేషన్ ఎలా జరుగుతుంది?**

**జవాబు:** భూముల రిజిస్ట్రేషన్ అయిన వెంటనే మ్యుటేషన్ స్వయంచాలకంగా జరుగుతుంది. తదనంతరం రికార్డులలో పేరు మార్పు, హక్కుల నమోదు పూర్తి అవుతుంది. ఇది ధరణిలో చాలా ఆలస్యంగా జరిగేది. భూభారతిలో ఇది వేగంగా పూర్తవుతుంది.

**12. రిజిస్ట్రేషన్ పూర్తయిన తరువాత రైతుకి ఏమి ఇవ్వబడుతుంది?**

**జవాబు:** రైతుకు రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే భూమి యొక్క మ్యుటేషన్ నమోదు అవుతుంది. అనంతరం భూమికి సంబంధించిన మ్యాప్, భూధార్ కార్డు కూడా అందిస్తారు. దీంతో రైతుకి స్పష్టమైన హక్కు ఆధారాలు లభిస్తాయి.

**13. విరాసత్ ప్రక్రియ ఎలా జరుగుతుంది?**

**జవాబు:** ఒక రైతు మృతి చెందిన తరువాత వారసత్వ హక్కుల కోసం దరఖాస్తు చేయవచ్చు. వారసులందరికి నోటీసులు పంపించి, వారి అభ్యంతరాలు స్వీకరించి మాత్రమే రికార్డుల్లో మార్పులు (మ్యుటేషన్) చేస్తారు. ఇది భూ వివాదాలను ముందే అరికట్టే విధానం.

**14. సాదా బైనామా భూములపై పరిష్కారం ఉందా?**

జవాబు: అవును. పాత చట్టంలోని 13బీ ప్రకారం సాదా బైనామా భూములకు ప్రొసీడింగ్స్ ద్వారా చట్టబద్ధత కల్పించే మార్గాన్ని భూభారతి చట్టం కొనసాగిస్తుంది. దీని ద్వారా వేలాది మంది లబ్దిదారులకు న్యాయం జరగనుంది.

**15. కౌలు భూములకైనా రక్షణ ఉందా?**

**జవాబు:** ఉంది. 38ఈ ప్రకారం కౌలుదారులకు భూమిని న్యాయంగా కేటాయించి, వారిని పట్టాదారులుగా గుర్తించేందుకు ఆర్డీవో విచారణ అనంతరం పాస్‌పుస్తకాలు జారీ చేస్తారు.

**16. భూధార్ కార్డు పొందడంలో రైతు చేయాల్సిన ప్రక్రియ ఏంటి?**

**జవాబు:** భూధార్ కార్డు ఆటోమేటిక్‌గా తయారవుతుంది. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ పూర్తయిన తరువాత భూమికి ప్రత్యేక నంబరుతో కార్డు జారీ అవుతుంది. రైతు దాన్ని భూభారతి పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు , కార్యాలయంలో పొందవచ్చు.

**17. భూభారతి పోర్టల్‌లో ఎలాంటి సేవలు లభిస్తాయి?**

**జవాబు:** భూమి వివరాలు, మ్యుటేషన్ స్టేటస్, రిజిస్ట్రేషన్ వివరాలు, భూధార్ కార్డు, జీపీ వివో సంపర్క వివరాలు వంటి ఎన్నో సేవలు పొందవచ్చు. ఇది మరింత వినియోగదారులకు అనుకూలంగా రూపొందించబడింది.

**18. భూ వివాదాల పరిష్కారానికి ట్రైబ్యునల్ ఎలా పని చేస్తుంది?**

**జవాబు:** రైతు లేదా పౌరుడు దరఖాస్తు చేస్తే, ట్రైబ్యునల్ విచారణ చేపట్టి నోటీసులు జారీ చేస్తుంది. రెండు పక్షాల వాదనలు విని తీర్మానం చేస్తుంది. దీని తీర్పు కోర్టు తీర్పుల్లానే చట్టబద్ధంగా ఉంటుంది.

**19. ధరణిలో ఉన్న భూముల పరిస్థితి ఏమవుతుంది?**

**జవాబు:** ధరణిలో నమోదైన భూములన్నింటిని భూభారతి చట్టానికి అనుగుణంగా సమీకరించి, కొత్త రికార్డుల్లోకి మార్చుతారు. పాత లోపాలను సరిచేసి ఖచ్చితమైన రికార్డు తయారు చేయడం జరుగుతుంది.

**20. పట్టాదారు పాస్‌బుక్ అంటే ఏమిటి?**

**జవాబు:** భూమికి సంబంధించిన హక్కుల, పరిమాణాల, రిజిస్ట్రేషన్, భూధార్ వివరాలన్నింటినీ కలిపిన అధికారిక పత్రమే పట్టాదారు పాస్‌బుక్. ఇది భూమిపై హక్కును నిరూపించే ప్రధాన పత్రం.

**21. కొత్త చట్టంలో తహసీల్దార్‌కు పాత్ర ఏమిటి?**

**జవాబు:** తహసీల్దార్‌కు భూముల నమోదులో కీలక పాత్ర ఉంటుంది. కానీ గ్రామస్థాయిలో గ్రామ పరిపాలన అధికారులు మొదటి స్పందన అధికారులు అవుతారు. తహసీల్దార్ వారి నివేదికల ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటారు.

**22. భూభారతి చట్టానికి సంబంధించిన ఫిర్యాదులు ఎక్కడ చేయాలి?**

**జవాబు:** భూభారతి పోర్టల్‌లో ఫిర్యాదుల సెక్షన్ ఉంటుంది. అలాగే మండల, జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చు.

**23. కోర్టు చార్జీలు లేకుండా ఈ ట్రైబ్యునల్‌లో కేసులు వేయొచ్చా?**

**జవాబు:** అవును. ఇది కోర్టు వంటిదే కానీ చాలా తక్కువ ఖర్చుతో, త్వరిత విచారణ చేసే వ్యవస్థ. రైతులకు ఇది ఎంతో ప్రయోజనం కలిగించే పరిష్కార మార్గం.

**24. భూ హక్కుల రికార్డు ఎలా ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చు?**

**జవాబు:** భూభారతి పోర్టల్‌లో భూమి వివరాలు, రికార్డు ఆన్‌లైన్‌లో చూడవచ్చు. భూమి ఖతా నంబర్, భూధార్ కార్డు నంబర్ లేదా పేరు ఆధారంగా వివరాలు లభిస్తాయి.

**25. ఈ కొత్త చట్టం అమలవ్వడానికి ఏ శాఖలు పనిచేస్తున్నాయి?**

**జవాబు:** రెవెన్యూ శాఖ ప్రధాన సమన్వయ సంస్థ. అయితే ఐటి శాఖ, రిజిస్ట్రేషన్ శాఖ, న్యాయ శాఖలు కలసి ఈ చట్ట అమలులో భాగస్వాములు.

**26. భూభారతి చట్టం రైతులకి ఎలా ప్రయోజనం కలిగిస్తుంది?**

**జవాబు:** రైతులు ఇన్నాళ్లుగా ఎదుర్కొంటున్న భూ వివాదాలు, రికార్డు లోపాలు, మ్యుటేషన్ ఆలస్యం, కోర్టుల చుట్టూ తిరుగుడు వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారంగా భూభారతి చట్టం మారుతుంది. ఖచ్చితమైన భూ హక్కుల రికార్డు, వేగవంతమైన సేవలు, గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థ పునరుద్ధరణ వంటివి రైతుల భద్రతను గణనీయంగా మెరుగుపరుస్తాయి.

**27. జీపీవోల భూమి సేవలలో పాత్ర ఏంటి?**

**జవాబు:** గ్రామ పాలనాధికారులు భూమి సేవల్లో మొదటి స్థాయి అధికారులుగా ఉంటారు. వారు భూమి నమోదులు, సర్వే, విరాసత్, మ్యుటేషన్ తదితర సేవలు సమన్వయపరుస్తారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ సేవలు అందించేందుకు 10,954 అధికారులను నియమించనున్నారు.

**28. భూముల సర్వే ఎలా జరుగుతుంది?**

**జవాబు:** భూభారతి ప్రకారం సాంకేతిక పద్ధతుల్లో డిజిటల్ సర్వే జరుగుతుంది. దీనిలో డ్రోన్ సర్వే, GPS ఆధారిత సరిహద్దు గుర్తింపు, లింక్ మ్యాపింగ్ వంటివి ఉంటాయి. సర్వే అనంతరం భూమికి లింక్‌డ్ రికార్డు తయారవుతుంది.

**29. భూమిని అమ్మిన వెంటనే మ్యుటేషన్ కావడంలో ప్రయోజనం ఏంటి?**

**జవాబు:** ఒకరు భూమిని విక్రయించిన వెంటనే మ్యుటేషన్ పూర్తవడం వల్ల కొత్త యజమానుడికి వెంటనే హక్కులు లభిస్తాయి. వాయిదా లేకుండా రుణాలు తీసుకునే వీలు, వివాదాలు లేకుండా సాగుచేయటం వంటి ప్రయోజనాలు ఉన్నాయి.

**30. భూధార్ కార్డు వల్ల కలిగే లాభాలేంటి?**

**జవాబు:** భూధార్ కార్డు ఒక భూమికి ఆధార్ లాంటి గుర్తింపు. ఇది భూమి వివరాలను, యజమానిని, సరిహద్దులను స్పష్టంగా చూపుతుంది. బ్యాంకు లోన్లు, ప్రభుత్వం సబ్సిడీలు, న్యాయ పరిరక్షణ వంటి వాటికి ఇది ప్రధాన ఆధారం అవుతుంది.

**31. సర్టిఫైడ్ కాపీలు ఎలా పొందవచ్చు?**

**జవాబు:** భూభారతి పోర్టల్ ద్వారా, తహసీల్దార్ కార్యాలయం ద్వారా హక్కుల రికార్డుల సర్టిఫైడ్ కాపీలు పొందవచ్చు. ఇది ఆధారితంగా ముద్రించబడిన, చట్టబద్ధ పత్రంగా లెక్కించబడుతుంది.

**32. భూముల పునఃసర్వే ఎప్పుడు పూర్తవుతుంది?**

**జవాబు:** రాష్ట్రవ్యాప్తంగా పునఃసర్వే దశలవారీగా కొనసాగుతుంది. 2025 చివరికి ఎక్కువగా డిజిటల్ మానిటరింగ్ ద్వారా పూర్తయ్యేలా ప్రభుత్వం ప్రణాళిక రచించింది.

**33. ఈ చట్టం ప్రైవేట్ రియల్ ఎస్టేట్ వ్యవహారాలపై ప్రభావం చూపుతుందా?**

**జవాబు:** అవును. భూభారతి ద్వారా భూముల రికార్డులు స్పష్టతకు వస్తాయి. దీని వల్ల అనధికారికంగా భూములు అమ్మకాలు జరగకుండా చేయడం, భవిష్యత్తులో మోసాలను నివారించగలుగుతుంది.

**34. ప్రభుత్వ భూములపై పబ్లిక్ యాక్సెస్ ఉందా?**

**జవాబు:** భూభారతిలో ప్రభుత్వ భూముల వివరాలు కూడా పొందుపరచబడ్డాయి. వీటిపై హక్కుల వివరాలు, కేటాయింపులు చూడవచ్చు. పబ్లిక్ యాక్సెస్ ద్వారా అవగాహన పెరిగి అక్రమ ఆక్రమణలకు అడ్డుకట్ట పడుతుంది.

**35. సర్టిఫికెట్ లేకుండా భూమి కొనుగోలు చేస్తే?**

**జవాబు:** భూధార్ కార్డు లేకుండా, రిజిస్ట్రేషన్ పూర్తి కాకుండా భూమి కొనుగోలు చేయడం భవిష్యత్తులో చట్టబద్ధంగా ఉండదు. తద్వారా భూ లావాదేవీలలో పారదర్శకత పెరుగుతుంది.

**36. భూమి రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ఖర్చు ఎంత?**

**జవాబు:** ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీలు ఉన్నప్పటికీ, మ్యుటేషన్ ఖర్చులు పూర్తిగా తగ్గించబడ్డాయి. గ్రామస్థాయిలోనే తక్కువ ఖర్చుతో సేవలు లభిస్తాయి.

**37. ఈ చట్టం అమలులో ఎలాంటి అవినీతికి అవకాశం ఉందా?**

**జవాబు:** మానవ సంపర్కం తగ్గించి, డిజిటల్ పద్ధతులు ఎక్కువగా అమలుచేస్తుండటం వల్ల అవినీతికి అవకాశాలు తగ్గుతున్నాయి. రికార్డుల పారదర్శకత వల్ల అధికారుల తప్పుడు చర్యలు వెలుగులోకి వస్తాయి.

**38. భూములపై పునఃవిమర్శకు అవకాశం ఉందా?**

**జవాబు:** ఓ పౌరుడు భూభారతి రికార్డులో తప్పు ఉందని భావిస్తే, ట్రైబ్యునల్ లేదా సంబంధిత జీ టీవీ ఓ కార్యాలయంలో రిప్రెజెంటేషన్ ఇవ్వొచ్చు. విచారణ అనంతరం తప్పులను సరిదిద్దే అవకాశం ఉంటుంది.

**39. గ్రామ సభలతో ఈ చట్టం ఎలా అనుసంధానమవుతుంది?**

**జవాబు:** ప్రతి గ్రామ సర్వే తర్వాత గ్రామ సభలకు రిపోర్ట్ ఇవ్వాలి. గ్రామస్థాయి సమావేశాల్లో ప్రజాప్రతినిధుల సమక్షంలో రికార్డులు ప్రదర్శన చేయాలి. దీని వల్ల ప్రజల నిగ్రహం పెరుగుతుంది.

**40. ఖాతాదారుల వివరాల మార్పు ఎలా చేయాలి?**

**జవాబు:** భూ వివరాలలో పేర్ల మార్పు, చిరునామా మార్పుల కోసం ఆధారాలు సమర్పించి, మౌలిక రికార్డు అప్డేట్ చేయాల్సి ఉంటుంది. ఇది జిపి వివో–తహసీల్దార్ స్థాయిలో పరిశీలన అనంతరం జరుగుతుంది.

**41. భూభారతి చట్టానికి సంబంధించిన శిక్షల ప్రావధానాలేమైనా ఉన్నాయా?**

**జవాబు:** అవును. రికార్డులలో చెల్లని డాక్యుమెంట్లు, అవాస్తవ సమాచారం, అనధికారికంగా హక్కులు క్లెయిమ్ చేయడం లాంటి చట్ట ఉల్లంఘనలకు శిక్షలు విధించే నిబంధనలు ఉన్నాయి.

**42. అన్యాయంగా హక్కు కోల్పోయిన రైతుకు న్యాయం ఎలా?**

**జవాబు:** బాధితుడు ట్రైబ్యునల్‌కు ఫిర్యాదు చేస్తే విచారణ అనంతరం తప్పును సరిదిద్దే ఉత్తర్వులు జారీ చేస్తారు. ఇది వేగంగా అమలవుతుంది. అవసరమైతే జిల్లా కలెక్టర్ స్థాయిలో అప్పీల్ అవకాశం ఉంది.

**43. భూభారతిలో భూమిని లీజ్ ఇవ్వొచ్చా?**

**జవాబు:** అవును. భూభారతిలో లీజ్ డీడ్‌లను కూడా నమోదు చేసుకునే వీలుంది. ఇది భవిష్యత్తులో కౌలు రైతులకు చట్టబద్ధ రక్షణ కల్పిస్తుంది.

**44. భూభారతిలో భూముల విలువ గణాంకాలు లభిస్తాయా?**

**జవాబు:** భవిష్యత్తులో భూభారతి ద్వారా భూముల మార్కెట్ విలువలు, సర్వే డేటా ఆధారంగా విలువలు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి.

**45. భూ హక్కులు మహిళలకు ఎలా రక్షించబడతాయి?**

**జవాబు:** సంయుక్త రిజిస్ట్రేషన్, పతి–భార్య పేరు ఉండే పాస్‌బుక్లు, వారసులుగా మహిళలకు ప్రాధాన్యత వంటి చర్యల ద్వారా మహిళల హక్కులు భద్రపరిచేలా చట్టం రూపొందించబడింది.

**భూభారతి చట్టం వల్ల భవిష్యత్తులో రైతు భవిష్యత్తు ఎలా మారుతుంది?**

**జవాబు:** భూభారతి చట్టం వల్ల రైతుకు స్థిరమైన హక్కులు, తక్షణ న్యాయం, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు, కోర్టుల చుట్టూ తిరిగే నష్టాల నివారణ, భూముల రికార్డు ఆధారంగా రుణాల సౌలభ్యం లభిస్తాయి.

# వృద్ధురాలి దారుణ హత్య



**కాటారం, మహా :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని ఆదివారం పేట గ్రామంలో వృద్ధురాలు దారుణ హత్యకు గురైంది. మహాదేవపూర్ సిఐ రామచంద్రరావు కథనం ప్రకారం అదివారంపేట గ్రామానికి చెందిన ఒడేటి మల్లుబాయి (72) ఒక్కరే ఇంట్లో నివసిస్తోంది. పాలుపోసే వ్యక్తి ఇంటికి పోయేసరికి మల్లుబాయి హత్యకు గురైనట్టు తెలిపారు. శనివారం గుర్తుతెలియని వ్యక్తులు మరియు హత్య చేసినట్టుగా తెలుస్తోందన్నారు. పోలీస్ స్టేషన్ లో చేసిన ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సి ఐ రాంచందర్ రావు తెలిపారు. సంఘటన స్థలంనకు డి ఎస్ పి రామ్మోహన్ రెడ్డి సందర్శించారు. జాగిలాలతో నేరస్తులను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. వృద్ధురాలు దారుణ హత్యకు గురవడం మండలంలో సంచలన సంఘటనగా మారింది.

## అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధి చేసిన
# బీజేపీ జిల్లా అధ్యక్షుడు



**వరంగల్, మహా:** రాజ్యాంగాన్ని రూపొందించి మనకు అందించిన గొప్ప మహనీయుడు అంబేద్కర్ అని వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ అన్నారు. సోమవారం ఆయన జయంతి సందర్భంగా ఆదివారం బిజెపి నాయకులతో కలిసి భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహన్ని పాలతో శుద్ధి చేశారు. అంబేద్కర్ జయంతి ఉత్సవాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర నాయకులు చింతాం సాంబమూర్తి హాజరైయ్యారు. వరంగల్ జిల్లా తూర్పు నియోజకవర్గం కాశిబుగ్గ జంక్షన్ లో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు పోలేపాక మార్టిన్ లూథర్ ఆధ్వర్యంలో జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి మాదాసి రాజు సమక్షంలో భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలలో భాగంగా అంబేద్కర్ విగ్రహం శుద్ధి చేసి, పరిసరాలను శుభ్రం చేయడం జరిగింది. అనంతరం అధ్యక్షులు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను కాంగ్రెస్ పార్టీయే అనేక సార్లు అవమానించిందని, ఆయన ఆనవాళ్ళను సమూలంగా తుడిచి పెట్టేయాలని ప్రయత్నించిందని గంట రవికుమార్ మండి పడ్డారు. అంబేద్కర్ ను సంపూర్ణంగా గౌరవిచ్చింది బిజెపి మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ఎస్సీ మోర్చా ఇన్చార్జి రామిండ్ల బాబురావు, జిల్లా ఎస్సీ మోర్చా పదాధికారులు మైదం వీరస్వామి, ఉసిల్ల దయాకర్,కంజర్ల విజయ్, మారుమూల ప్రవీణ్, జన్ను ఆరోగ్యం, చింతల నవీన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, డాక్టర్ వన్నాల వెంకటరమణ, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎరుకుల రఘునారెడ్డి, గడల కుమార్, మాచర్ల దీన్ దయాల్, బిజెపి సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు గోవింద్ సింగ్ తో పాటు బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంక్షేమము లో తెలంగాణ
# దేశానికే ఆదర్శం

- అన్ని రాష్ట్రాల చూపు తెలంగాణ వైపు
- గత పాలకులు పదేళ్లపాటు సన్న బియ్యం సంగీతం పాడారు తప్ప ఇవ్వలేదు
- సన్న బియ్యంతో 3.10 కోట్ల మందికి లబ్ధి
- సన్న బియ్యానికి ఏడాదికి 13,525 కోట్లు వెచ్చిస్తున్నాం



**ఖమ్మం, మహా:** సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని, పెద్ద సంఖ్యలో సంక్షేమ పథకాలు ఎలా అమలు చేస్తున్నారని అన్ని రాష్ట్రాలు తెలంగాణ వైపు చూస్తున్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం ఆయన మధిర మండలం, మధిర మున్సిపాలిటీలో వందల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన తదుపరి తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గత పాలకులు 8 లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రాన్ని అప్పగిస్తే వాటన్నిటినీ సరి చేసుకుంటూ ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో తెలంగాణ ప్రభుత్వం ఎక్కడా వెనుకడుగు వేయడం లేదు అన్నారు. గత పాలకులకు ధనిక రాష్ట్రాన్ని చేతిలో పెడితే పది సంవత్సరాలపాటు సన్న బియ్యం సంగీతం పాడారు తప్ప గింజ కూడా పంపిణీ చేయలేదని ఆరోపించారు. పేద వర్గాలకు సన్న బియ్యం పంపిణీ దేశంలో ఎక్కడా జరగడం లేదు అన్నారు. సన్న బియ్యంతో తినాలని ఆశగా ఎదురు చూసే వారికి గత ఉగాది నుంచి రాష్ట్రంలోని 90 లక్షల రేషన్ కార్డులు ఉన్న కుటుంబాలకు, 2.85 కోట్ల మంది లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని వివరించారు. ఇవే కాకుండా కొత్తగా రాబోతున్న రేషన్ కార్డులతో కలిపి రాష్ట్రంలో ఒక కోటి రేషన్ కార్డు దారులకు, 3.10 కోట్ల మంది లబ్ధిదారులకు సన్న బియ్యం అందించే కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. నిరుపేదలకు సన్న బియ్యం అందించేందుకు ప్రజా ప్రభుత్వం ప్రతి సంవత్సరం 13,525 కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. పేద ప్రజల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న నిబద్ధత, అంకిత భావాన్ని ఈ పథకం తెలియజేస్తుందని అన్నారు. కనీ వినీ ఎరుగని గొప్ప కార్యక్రమానికి రాష్ట్ర ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన వస్తుందని తెలిపారు. గొప్ప సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రతి గింజను వినియోగించుకోవాలని డిప్యూటీ సీఎం రాష్ట్ర ప్రజలను ఈ సందర్భంగా కోరారు. రాష్ట్ర ప్రజలకు సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేయడమే కాదు సన్నధాన్యం సాగు చేసే రైతులకు మరోవైపు బోనస్ అందించి ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. సన్న ధాన్యం సాగు చేసే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం 2,675 కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమాలు చేపడుతూనే మరోవైపు రైతు రుణమాఫీ కోసం 21 వేల కోట్లు, రైతు భరోసా కు 18 వేల కోట్లు, సన్నధాన్యం బోనస్ గా 2,675 కోట్లు, వ్యవసాయ పంపుసెట్లకు 24 గంటలు ఉచిత విద్యుత్ కోసం 12,500 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తుందని వివరించారు. ఇవన్నీ చేపడుతూ తిరిగి పేదలకు సన్న బియ్యం అందించేందుకు 13,525 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. నియామకాల కోసం కోరి కొట్లాడి తెలంగాణ రాష్ట్రాన్ని యువకులు సాధించుకున్నారూ. వారి కలలు నిజం చేసే క్రమంలో ఇప్పటికే 56 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసాం, మరో 30 వేల ఉద్యోగాలు భర్తీ చేయబోతున్నాం అని డిప్యూటీ సీఎం తెలిపారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేసి జాబ్ క్యాలెండర్ విడుదల చేశామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు రాక మిగిలిపోయిన నిరుద్యోగుల కోసం 9,000 కోట్లతో రాజీవ్ యువ వికాసం పేరిట కొత్త స్వయం ఉపాధి పథకాలను చేపట్టినట్టు తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకం ప్రకటన నాటి నుంచి సాంక్షన్ లెటర్ ఇచ్చేవరకు క్యాలెండర్ ప్రకటించి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు పోతుందని వివరించారు. వరుస సెలవులు, వివిధ వర్గాల విజ్ఞప్తి మేరకు రాజీవ్ యువ వికాసం గడువును ఏప్రిల్ 14 వరకు పెంచామని, మండల, జిల్లాస్థాయిలో దరఖాస్తుల పరిశీలన ఎప్పటి వరకు ముందే ప్రకటించినట్టు తెలిపారు. జూన్ 2 నుంచి 9 వరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాల్లో శాంక్షన్ లెటర్లు ఇచ్చే కార్యక్రమం పూర్తి చేస్తామని తెలిపారు. ప్రకటించిన క్యాలెండర్ ను తూచా తప్పక పాటిస్తామని స్పష్టం చేశారు. రాజీవ్ యువ వికాసం కింద ఎంచుకున్న పథకానికి కనీసం మూడు రోజుల నుంచి వారం రోజులపాటు శిక్షణ కార్యక్రమం, తదుపరి గ్రౌండింగ్ పూర్తి చేసేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్టు డిప్యూటీ సీఎం వివరించారు. నిరుద్యోగ యువత రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు. సమావేశంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, హస్తకళల బోర్డు చైర్మన్ నాయుడు సత్యం తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయంగా పూర్వ విద్యార్థుల
# అపూర్వ సమ్మేళనం



**వరంగల్, మహా:** వరంగల్ నగరం దయానంద కాలనీ లోని వాణీనికేతన్ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించిన 19771978 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం గురువుల సమక్షంలో ఆనందోత్సవాల మధ్య నగరంలోని హోటల్ రత్న హోల్లో ఘనంగా నిర్వహించారు. పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు 47 ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకుని ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. చదివిన బడి, పరిసరాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. నాడు గురువులు నేర్పిన క్రమశిక్షణ, చదువుతో ఈరోజు వివిధ స్థాయిల్లో ఉన్నామని వారు తెలిపారు. ఈ సందర్భంగా తమకు విద్యా బుద్ధులు చెప్పిన గురువులను పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో ఘనంగా సన్మానించి మెమొంటోలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూర్యనారాయణ, ప్రకాష్, జోషి.. శ్యామ్, సరళ, తో పాటు పూర్వ విద్యార్థులు సామ్యేల్, సుధాకర్ రెడ్డి, వెంకటరమణ, రామారావు, నాగేందర్, రవి, బాలకృష్ణ, యామిని, తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమం కోసమే ఐకేపి సెంటర్లు



**వరంగల్, మహా:** వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట నియోజకవర్గం ప్రజా పాలనలో రైతు ను రాజు ను చేయడం కోసమే ప్రజలు ఇందిరమ్మ రాజ్యం కోరుకున్నారని ఇందులో భాగంగానే రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్. నాగరాజు, తెలంగాణ ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి అన్నారు. ఆదివారం కాజీపేట మండలం టేకులగూడెం లో ఐకేపి సెంటర్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా వర్ధన్న పేట ఎమ్మెల్యే కే. ఆర్ నాగరాజు, తెలంగాణ ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి విచ్చేసి సెంటర్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రైతులు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు, పాల్గొన్నారు.

# తండ్రి అడుగుజాడల్లోనే అభివృద్ధికి కృషి

**శ్రీపాదరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మంత్రి శ్రీధర్ బాబు**



**కాటారం, మహా :** మంథని నియోజకవర్గంలో తండ్రి శ్రీపాదరావు ఆశయాల సిద్ధించేందుకు అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన అడుగుజాడల్లోనే ముందుకు వెళుతున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు శ్రీపాదరావు అమర్ హై అంటూ గొంతు ఎత్తి నినదిస్తుండగా కీర్తిశేషులు మాజీ స్పీకర్ శ్రీపాదరావు 26వ వర్ధంతి సందర్భంగా ఆదివారం కాటారం మండల కేంద్రంలో శ్రీపాదరావు విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉమ్మడి కరీంనగర్ మాజీ డిసిసి అధ్యక్షులు ఖడ్గం మృత్యుంజయం శ్రీపాదరావు విగ్రహానికి పూలమాలలు వేశారు. జిల్లా,మండల కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు , కార్యకర్తలు శ్రీపాదరావుకు నివాళులు అర్పించారు.

## మహనీయుల బాటలో నడవటం
# హర్షణీయం

- భారత రాజ్యాంగం ద్వారనే సమానత్వం సాధ్యం
- వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద



**వరంగల్, మహా:** సామాజిక, ఆర్థిక అసమానతల నిర్మూలన కోసం జీవితాంతం పోరాడిన మహనీయుల బాటలో నడవటం హర్షనీయమని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద అన్నారు. ఏప్రిల్ మాసంలో మహనీయులైన మహాత్మా జ్యోతి రావు పూలే, బాబు జగ్జీవన్ రావ్, భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ల జయంతులను పురస్కరించుకుని ప్రభుత్వ ఉద్యోగుల జే ఏ సి ఆధ్వర్యంలో ఆదివారం హన్మకొండ అదాలత్ సెంటర్ నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జంక్షన్ వరకు మహనీయుల స్మృతిలో మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ డాక్టర్ సత్య శారద జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహనీయుల స్మృతిలో మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు అభినందించారు. ప్రపంచంలోనే మహోన్నతమైన రాజ్యాంగాన్ని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మనకు అందించారన్నారు. రాజ్యంగంలో ప్రాథమిక హక్కులు,ప్రాథమిక విధులు ప్రతి ఒక్కరూ పాటిస్తూ ఆచరించాలని కోరారు. సమానత్వాన్ని సాధించటం, ప్రజా స్వామ్య విలువలను కాపాడడం ప్రతి ఒక్కరికి బాధ్యత అని గుర్తు చేశారు. జై బాపు.. జై భీమ్..జై సంవిధాన్ అనే నినాదంతో సామాజిక రుగ్మతల నిర్మూలనకు కృషిచేయాలన్నారు. భారత రాజ్యాంగం ద్వారానే సమసమాజ నిర్మాణం సాధ్యం అవుతుందని, ఇందుకు పూలే, అంబేద్కర్ లాంటి మహనీయుల జీవిత చరిత్రలు మన పిల్లలకు తెలుపాలని, మన ఇంటి నుండే మొదలు అవ్వాలన్నారు. సమాజంలోని అసమాన తలను రూపుమాపుటలో మన పిల్లలకు మనం రాజ్యాంగ విధివిధానాలను ప్రజాస్వామ్య హక్కులను విధులను తెలుసుకునేలా మనం తగిన కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జె డి అగ్రికల్చర్ అధికారి అనురాధ, వరంగల్ జిల్లా టీజీవో అధ్యక్ష కార్యదర్శులు జడ్పి సీఈఓ రాంరెడ్డి , డి ఆర్ డి ఓ కౌసల్యదేవి, అడిషనల్ పిఆర్ఓ ప్రేమలత,ఆసనాల శ్రీనివాస్, గురుకుల అధ్యాపకుల సంఘం రాష్ట్ర నాయకులు రౌతు అజయ్ కుమార్, తహశీల్దార్ నాగరాజు, వ్యవసాయ శాఖ నుండి శ్రీప్రియ ,పవిత్ర ,కమలాఖర్, పోల్ రాజు ,జీవనజ్యోతి ,యాకయ్య, హరిప్రసాద్ , టి యన్ జి ఓ హన్మకొండ అధ్యక్ష్యుడు ఆకుల రాజేందర్ ,కార్యదర్శి సోమన్న ,వరంగల్ కార్యదర్శి వేణు గోపాల్,ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తారల సందీప్, అభ్యుదయ సేవ సమితి అధ్యక్షులు మండల పరిషరాములు, అడ్వకేట్ దండు మోహన్ , డాక్టర్ పుచ్చ లక్ష్మీనారాయణ లతో పాటు, యుటియఫ్ నేత బద్దం వెంకట రెడ్డి ,ప్రిన్సిపాల్స్ సంఘ నేత అజయ్,సామాజిక కార్యకర్తలు మండల పరశురాములు ,అనుమాండ్ల విద్యాసాగర్,టి జి ఓ అనుబంధ పలు ఉద్యోగ సంఘ నేతలు కూమరస్వామి,రఘుపతి రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సోగాల అంజయ్య, సుధాకర్ ల తో పాటు సుమారు 100 మంది ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి
# చెక్కుల పంపిణీ



**వెంకటాపురం, మహా:** ములుగు జిల్లా నూగూరు వెంకటాపురం మండల కేంద్రం అతిథి గృహం ఆవరణలో ఆదివారం ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద పది మందికి చెక్కుల పంపిణీ చేశారు. పేదల వైద్యానికి ప్రభుత్వం ఎల్లవేళల అండదండగా ఉంటుందని, వివిధ వైద్యశాలలలో చికిత్సలు పొందిన వారికి ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద పది మందికి చెక్కులు పంపిణీ చేసినట్లు సీనియర్ కాంగ్రెస్ నాయకులు పిఎసిఎస్ అధ్యక్షులు చిడెం మోహన్ రావు అన్నారు. మొత్తం రూ, 8. 50 లక్షల నిధులను పదిమందికి పంపిణీ చేశారు. పంపిణీ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ హుస్సేన్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు చిట్టెం సాయి, ఎస్సీ సెల్ అధ్యక్షులు సాధన పెళ్లి శ్రీనివాసరావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీరాముల రమేష్, మద్దుకూరి ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఈస్ట్ సిటీలో అగ్రగామిగా
# ఎస్వీ నిర్మాణ సంస్థ

- బ్రోచర్ లాంచ్ చేసిన డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్
- నాణ్యమైన ప్రమాణాలతో నిర్మాణాలు చేపట్టాలి
- ఎస్వి నిర్మాణ సంస్థలో అతి తక్కువ ధరలో ప్లాట్లు



**రంగారెడ్డి జిల్లా, మహా:** ఆదిభట్ల మున్సిపాలిటిలో ఘనంగా ఎస్వీ నిర్మాణ సంస్థ యొక్క బ్రోచర్ ను డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ లాంఛనంగా ప్రారంభించారు. ఈస్ట్ సిటీలో నాణ్యత ప్రమాణాలతో కూడిన ఎస్వీ నిర్మాణ సంస్థ, అగ్రగామిగా పేరు పొందుతూ రంగారెడ్డి జిల్లా, ఆదిభట్లలో స్కైలైన్ ఇంపీరియల్ నూతన ప్రాజెక్ట్ ను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఐపీఎస్ డాక్టర్ ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్, ఎస్వీ నిర్మాణ సంస్థ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తో కలిసి బ్రోచర్ రిలీజ్ చేసారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ... రియల్ ఎస్టేట్ నిర్మాణంలో ఎస్వి నిర్మాణ సంస్థ వినియోగదారులకు నాణ్యమైన నిర్మాణాలు చేపడుతూ, అతి తక్కువ ధరలో ప్లాట్లను అందించడం వల్ల, పేద మధ్య తరగతి ప్రజలకు విక్రయించడానికి అనుకూలంగా ఉంటుందని అన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకొని ధరలో రాజీ పడుతూ, నాణ్యతలో ఎక్కడ కూడా రాజీ పడవద్దు అని ఆయన సూచించారు. నిర్మాణ సంస్థ చైర్మెన్ మాట్లడుతూ... గత 20 సంవత్సరాలుగా రియల్ ఎస్టేట్ రంగంలో వడిదుడుకులు ఎదుర్కొంటూ, రియల్ ఎస్టేట్ కట్టుబడి నిర్మాణంలో దూసుకుపోతున్న సంస్థ ఎస్వీ నిర్మాణ సంస్థ అని అన్నారు. హైదరాబాద్ ఈస్ట్ సిటీలో అతి తక్కువ ధరకు, నాణ్యమైన ప్రమాణాలతో కూడిన నిర్మాణాలను చేపడుతూ వినియోగదారులకు అందుబాటులో ఉండేలా, సంస్థ వారికి అందిస్తుందని అన్నారు. మధ్యతరగతి వినియోగదారులకు అనుకూల వాతావరణంలో అత్యాధునిక ప్రమాణాలతో, అపార్ట్మెంట్లలో డబుల్ బెడ్ రూమ్ ప్లాట్లను అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు వేలమంది వినియోగదారులు తమ సంస్థలో పెట్టుబడులు పెట్టారని, వాళ్లకు ఆశించిన స్థాయిలో లాభాలు వచ్చాయని ఆయన తెలియజేశారు. మా యొక్క నిర్మాణ సంస్థ రాష్ట్ర టీజీ రేరా, హెచ్ఎండీఏ అనుమతులను ప్రభుత్వం ద్వారా పొంది, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు తల్లితక్కుండా చూడడం జరుగుతుంది అని అన్నారు. ఈ ప్లాట్ లకు 10 శాతం డబ్బులు వెచ్చించి 90 శాతం వరకు బ్యాంకు ద్వారా రుణం పొందే అవకాశం కల్పించడం జరుగుతుందని తెలియజేశారు. వెస్ట్ సిటీ తో పోల్చుకుంటే, ఈస్ట్ సిటీ ఆదిభట్లలో వినియోగదారులకు అతి తక్కువ ధరలో ప్లాట్లను, విల్లాలను అందించడం జరుగుతుందని మరొకసారి తెలియజేశారు. భవిష్యత్తులో కూడా నాణ్యత లోపించకుండా వినియోగదారుల ప్రశంసలు అందుకుంటూ నిర్మాణ సంస్థలు నిలబెట్టుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజకీయ నాయకులు, వినియోగదారులు, ఏజెంట్లు, పలువురు పాల్గొన్నారు.

## సంపత్ కు ఉగాది
# పురస్కారం!



**కరీంనగర్, మహా:** వార్త సేకరణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కరీంనగర్ టీవీ9 సీనియర్ కరస్పాండెంట్ సంపత్ కుమార్ ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతీ ఏటా ఉత్తమ జర్నలిస్ట్ లకు ఉగాది పురస్కారాలు అందజేస్తారు. అందులో భాగంగా నిరంతరం వార్తా స్రవంతితో ప్రజలకు, ప్రభుత్వానికీ మధ్య వారధిగా ఉంటూ కచ్చితత్వంతో కూడిన వార్తలు అందించడంలో సంపత్ కుమార్ నిష్ణాతులు. గత 18 ఏళ్లుగా జర్నలిజంలో తన ప్రత్యేకతను చాటుకున్నారు. 2024 25 సంవత్సరానికిగాను ఉత్తమ జర్నలిస్టు ఉగాది పురస్కారాన్ని విజయవాడ వేదికగా సంపత్ కుమార్ పేరును ప్రకటించారు. అవార్డు రావడం పట్ల టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ, కార్యదర్శి రామ్ నారాయణ, టియుడబ్ల్యూజే ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు నగునూరి శేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల రవీందర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గాండ్ల శ్రీనివాస్, కొయ్యడ చంద్రశేఖర్, కోశాధికారి జి వెంకట్, రాష్ట్ర అనుబంధ కమిటీ సభ్యులు బల్మూరి విజయసింహారావు, ఒంటెల కృష్ణ, ఈద. మధుకర్ రెడ్డి, నర్సింగోజు మహేంద్ర చారి, మార్త ప్రకాష్, ఉమ్మడి జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి ఊరడి రవీందర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎండి సుకూర్ ఏ శైలేందర్ రెడ్డి భరణి కుమార్ సంయుక్త కార్యదర్శులు పూలు సంపత్ దాడి సంపత్ సిర్ర తిరుపతి కొండల్ రెడ్డి తోపాటు జిల్లా కార్యవర్గ సభ్యులు విద్యావంతులు మేధావులు వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



**రంగారెడ్డి జిల్లా, మహా:** యాచారం మండలం పరిధిలోని గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు స్థానిక శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి శంకుస్థాపన చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మల్కిజ్ గూడ, ధర్మన్నగూడ, నందివనపర్తి, గ్రామాలలో 75 లక్షలతో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజ్, యూత్ బిల్డింగ్, బీసీ కమ్యూనిటీ హాల్, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఓంకారేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్ వ్యవస్థాపక సభ్యులు సంఘం సత్తయ్య విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం ఫార్మాసిటీని రద్దు చేసి దాని స్థానంలో రాష్ట్ర ఖ్యాతిని ప్రపంచానికి చాటేలా ఫోర్త్ సిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి ఫోర్త్ సిటీని నిర్మించబోతున్నట్లు వివరించారు. స్కిల్ యూనివర్సిటీలు, ఐటీ కంపెనీలు, ఇతర పరిశ్రమలతో యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని తెలిపారు. రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో ఫార్మాసిటీకి భూములు ఇవ్వద్దని రైతులకు చెప్పినట్లు గుర్తు చేశారు. ఇచ్చిన భూములను ఏమి చేయలేమని, ఇవ్వని భూముల జోలికి రాదని, ఆ భూములను ప్రభుత్వం సేకరించాలని చెప్పారు.

## ప్రజల అభివృద్ధి,సంక్షేమమే
# ప్రభుత్వ ధ్యేయం

**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**



**కాటారం,మహా:** మండల పరిధిలోని ధన్వాడ సబ్ స్టేషన్ లో కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన అదనపు 33/11కెవి ఉప విద్యుత్ కేంద్రాన్ని రాష్ట్ర ఐటి,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు. అనంతరం కాటారంలోని శ్రీపాద రావు వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాటారం గ్రామ పంచాయతి కార్యాలయంలో రూ, 50 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతి భవనంను ప్రారంభిచారు.

## పూర్వ విద్యార్థుల
# ఆత్మీయ సమ్మేళనాలు

**గురువులకు సన్మానం**



**ములుగు, మహా :** ములుగు మల్లంపల్లి మండల కేంద్రాల్లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు జరిగాయి. చిన్న నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు శాలువాలతో సన్మానం చేసి అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మల్లంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 199798 ఎస్ఎస్సి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పాఠశాల ఆవరణలో జరిగింది. పూర్వ హెడ్మాస్టర్ గోపాల్ రెడ్డి, ఉషారాణి, మాజీ డిసిఈబి సెక్రటరీ విజయమ్మలు ముఖ్య అతిథులుగా హాజరు కాగా వారికి సన్మానం చేశారు. మాజీ సర్పంచ్ మంద కుమార్ స్వామి, మాజీ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ చిట్టి రెడ్డి మల్లారెడ్డి, పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. అదేవిధంగా మల్లంపల్లిలోని శ్రీ సిద్ధార్థ ఉన్నత పాఠశాలలో 2000 2001 బ్యాచ్ పదవతరగతి విద్యారులు వారికి చదువు నేర్పిన ఉపాధ్యాలయులను ఆహ్వానించి సన్మానించారు. ప్రధానోద్యాయుడు రాజేందర్, కరెస్పాండెంట్ రవి, ఉపాధ్యాయులు జ్యోతి, జానీ, బిక్షపతి, నారాయణ మాట్లాడుతూ.. విద్యార్థుల బాగు కోసమే ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తారని, మందలిస్తారని అప్పుడే విద్యార్థులు తీర్చిదిద్దబడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓల్డ్ స్టూడెంట్స్ బి.సాంబయ్య, సిహెచ్.సంతోష్, అశోక్, బాలకృష్ణ, వీరు, చంద్రచారి చిరంజీవి, దాసు గిరి, జానీ మియా, రాజు, రమేష్, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ములుగులోని ఆదర్శ బాలవిహార్ ఉన్నత పాఠశాల 2007, 2008 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది.



# గోల్డ్ రేటు ఇంకా పెరుగుతుందా?

## నిపుణులు ఏం చెబుతున్నారంటే..

2025 ప్రారంభం నుంచి బంగారం ధరలు పరుగులు పెడుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు గోల్డ్ రేటు 23 శాతం పెరిగింది. ఏప్రిల్ నెలలో మాత్రమే పసిడి ధర 5 శాతం పెరిగినట్లు స్పష్టమవుతోంది. శనివారం నాటికి బంగారం ధరలు గరిష్టంగా రూ. 95,670 వద్ద నిలిచాయి. అంతర్జాతీయ మార్కెట్లో కూడా బంగారం ధరలు కూడా భారీగా పెరిగాయి. ట్రాయ్ ఔన్సుకు $3,263 రికార్డు గరిష్ట స్థాయిని తాకిన తర్వాత కామెక్స్ గోల్డ్ 2.44 శాతం పెరిగి $3,254.90 వద్ద ముగిసింది. ఇప్పటి వరకు బంగారం ధరలు పెరుగుదల ఆల్ టైమ్ రికార్డ్ అని తెలుస్తోంది.

**బంగారం రేటు ఎందుకు పెరుగుతోంది**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన టారిఫ్స్.. బంగారం ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని తెలుస్తోంది. అనేక దేశాలపై విధించిన పరస్పర సుంకాలకు 90 రోజుల విరామం ప్రకటించగా.. చైనాపై సుంకాలను మాత్రం 125 శాతానికి పెంచారు. చైనా కూడా ప్రతీకారం తీర్చుకోవడంలో భాగంగా.. అమెరికా వస్తువులపై సుంకాలను 84 శాతం నుంచి 125 శాతానికి పెంచింది. ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య పెరుగుతున్న వాణిజ్య ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక వృద్ధి చుట్టూ అనిశ్చితిని పెంచాయి. దీంతో బంగారం ధరలు అమాంతం పెరిగిపోతున్నాయి.

స్టాక్ మార్కెట్లలో పెట్టిన పెట్టుబడులకు గ్యారెంటీ లేదు. కాబట్టి బంగారం మీద పెట్టుబడి పెడితే.. అది సురక్షితమైన ఆస్తిగా భావించేవారు సంఖ్య గణనీయంగా పెరగడంతో.. ఎక్కువమంది బంగారం కొనుగోలు చేయడానికి ఎగబడుతున్నారు. ఇది గోల్డ్ రేటు పెరగడానికి దోహదపడుతున్నాయి.

### బంగారం ధరలు తగ్గుతాయా?

వాణిజ్య యుద్ధం, డాలర్ విలువ తగ్గడం, వడ్డీ రేట్ల తగ్గింపు కారణంగా బంగారం ధరలు పెరుగుతూనే ఉంటాయని నిపుణులు భావిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు ట్రాయ్ ఔన్సుకు $3,300 నుంచి $3,500 వరకు పెరుగుతాయని చెబుతున్నారు. భారతదేశంలో 2025 చివరి నాటికి 10 గ్రాముల బంగారం రూ. 97,000 కు చేరుకుంటుందని HDFC సెక్యూరిటీస్ కమోడిటీ అండ్ కరెన్సీ హెడ్ 'అనుజ్ గుప్తా' అన్నారు. ధరలు పెరుగుదల ఇలాగె కొనసాగే అవకాశం ఉందని.. ఎల్కేపీ సెక్యూరిటీస్ , కమోడిటీ అండ్ కరెన్సీ, వీపీ రీసెర్చ్ అనలిస్ట్ జతీన్ త్రివేది కూడా వెల్లడించారు. దీన్ని బట్టి చూస్తే గోల్డ్ రేటు ఇప్పుడిప్పుడే తగ్గే సూచనలు లేదని స్పష్టంగా అర్థమవుతోంది.

# ఎలాన్ మస్క్ టాప్ సీక్రెట్: నెట్టింట్లో వైరల్

అమెరికా అధ్యక్షుడు 'డొనాల్డ్ ట్రంప్' ఇటీవల నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో.. ప్రపంచ కుబేరుడు 'ఎలాన్ మస్క్' తీసుకున్న నోట్‌ప్యాడ్ ఫోటో నెట్టింట్లో వైరల్ అవుతోంది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫోటోను గమనిస్తే.. టెస్లా సీఈఓ కాన్ఫరెన్స్ టేబుల్ వద్ద కూర్చుని 'ఎలాన్ మస్క్' అని రాసి ఉన్న నేమ్ కార్డ్ కనిపిస్తుంది. అక్కడే ఒక పేపర్ మీద 'టాప్ సీక్రెట్' రాసి ఉండటాన్ని గమనించవచ్చు. ఈ ఫోటోలో ఒక పెన్ను, ఖాళీ గాజు మాత్రమే కాకుండా యునైటెడ్ స్టేట్స్ అధ్యక్షుడి ముద్ర ఉన్న కోస్టర్ కూడా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఇది నెట్టింట్లో వైరక్ అవుతోంది. నెటిజన్లు తమదైన రీతిలో కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియా వినియోగదారులు మస్క్ నోట్‌ప్యాడ్‌ను జూమ్ చేయడంతో "టాప్ సీక్రెట్" అనే పదాలు కనుగొన్నారు. మీడియాను గందరగోళంలోకి నెట్టడానికి మస్క్ ఈ విధంగా చేసి ఉంటాడని.. ఒక నెటిజన్ కామెంట్ చేశాడు. దీనికి ఎలాన్ నవ్వుతున్న ఒక ఎమోజీతో రిప్లై ఇచ్చారు. ఒక ట్రిలియన్ నుంచి రెండు ట్రిలియన్ డాలర్ల వరకు.. అమెరికా వ్యయాలను తగ్గిస్తామని ఒకప్పటి నుంచి చెబుతున్న ఎలాన్ మస్క్ ఇప్పుడు మాట మార్చేశారు. ఇటీవల జరిగిన సమావేశంలో.. 150 బిలియన్ డాలర్ల వ్యయాలను తగ్గించగలమని క్లారిటీ ఇచ్చారు. అంతే కాకుండా ట్రంప్ నేతృత్వంలోని డోజ్ టీమ్ పర్ఫామెన్స్ అద్భుతంగా ఉందని మస్క్ మెచ్చుకున్నారు.



## పాత బైక్ ధరకే 2025 సుజుకి హయబుసా



సుజుకి మోటార్‌సైకిల్ కంపెనీ ఇండియన్ మార్కెట్లో విక్రయిస్తున్న ఖరీదైన బైకులలో సుజుకి హయబుసా ఒకటి. దీనిని కంపెనీ OBD2B నిబంధనలకు అనుగుణంగా అప్డేట్ చేసింది. అయితే ఈ అప్డేట్ బైక్ ధరలో మాత్రమే ఎలాంటి మార్పు లేదు. అంటే ఈ కొత్త బైక్.. పాత బైక్ ధరకే అందుబాటులో ఉందన్నమాట. 2025 సుజుకి హయబుసా బైక్ ధర రూ. 16.90 లక్షలు (ఎక్స్ షోరూమ్, ఢిల్లీ). చూడటానికి మునుపటి బైక్ మాదిరిగా అనిపించినప్పటికీ.. ఉద్గార నియమాలకు అనుగుణంగా అప్డేట్ అయింది. ఈ బైక్ అదే 1340 సీసీ ఇంజిన్ ద్వారా 190 హార్స్ పవర్, 150 న్యూటన్ మీటర్ టార్క్ అందిస్తుంది. ఇంజిన్ 6 స్పీడ్ గేర్‌బాక్స్ ఆప్షన్ పొందుతుంది.

సుజుకి మోటార్‌సైకిల్ కంపెనీ ఇండియన్ మార్కెట్లో విక్రయిస్తున్న ఖరీదైన బైకులలో సుజుకి హయబుసా ఒకటి. దీనిని కంపెనీ OBD2B నిబంధనలకు అనుగుణంగా అప్డేట్ చేసింది. అయితే ఈ అప్డేట్ బైక్ ధరలో మాత్రమే ఎలాంటి మార్పు లేదు. అంటే ఈ కొత్త బైక్.. పాత బైక్ ధరకే అందుబాటులో ఉందన్నమాట. 2025 సుజుకి హయబుసా బైక్ ధర రూ. 16.90 లక్షలు (ఎక్స్ షోరూమ్, ఢిల్లీ). చూడటానికి మునుపటి బైక్ మాదిరిగా అనిపించినప్పటికీ.. ఉద్గార నియమాలకు అనుగుణంగా అప్డేట్ అయింది. ఈ బైక్ అదే 1340 సీసీ ఇంజిన్ ద్వారా 190 హార్స్ పవర్, 150 న్యూటన్ మీటర్ టార్క్ అందిస్తుంది. ఇంజిన్ 6 స్పీడ్ గేర్‌బాక్స్ ఆప్షన్ పొందుతుంది.

## రేపు బ్యాంకులకు సెలవు: ఎందుకంటే?




'అంబేద్కర్ జయంతి'ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 14ను జాతీయ సెలవు దినంగా అధికారికంగా ప్రకటించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) కూడా సోమవారం దేశంలోని అన్ని బ్యాంకులకు సెలవు దినంగా పేర్కొంది. అంటే అన్ని బ్యాంకులు మూసి ఉంటాయన్నమాట. బ్యాంకులు అన్నీ క్లోజ్ అయినప్పటికీ.. ఆన్‌లైన్ బ్యాంకింగ్ (ఇంటర్నెట్ బ్యాంకింగ్, డిజిటల్ బ్యాంకింగ్ మొదలైనవి) సేవలన్నీ కూడా అందుబాటులో ఉంటాయి. బ్యాంకులకు వెళ్లి చేసుకోవలసిన పనులన్నీ ఎల్లుండికి (మంగళవారం) వాయిదా వేసుకోవాలి.

**ఇతర సెలవు దినాలు**

**15 ఏప్రిల్:** బెంగాలీ నూతన సంవత్సరం, భోగ్ బిహు (అసోం, పశ్చిమ్ బెంగాల్, అరుణాచల్ ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్‌లోని బ్యాంక్‌లకు సెలవు)

**18 ఏప్రిల్:** గుడ్ ఫ్రైడే (ఛండీగఢ్, త్రిపుర, అసోం, రాజస్థాన్, జమ్ము, హిమాచల్ ప్రదేశ్, శ్రీనగర్‌లోని బ్యాంక్‌లకు సెలవు)

**20 ఏప్రిల్:** ఆదివారం

**21 ఏప్రిల్:** గరియా పూజ (త్రిపురలోని బ్యాంక్‌లకు సెలవు)

**26 ఏప్రిల్:** నాల్గవ శనివారం.. **27 ఏప్రిల్:** ఆదివారం

**29 ఏప్రిల్:** పరశురామ జయంతి (హిమాచల్ ప్రదేశ్‌లోని బ్యాంక్‌లకు సెలవు)

**30 ఏప్రిల్:** బసవ జయంతి, అక్షయ తృతీయ (కర్ణాటకలోని బ్యాంక్‌లకు సెలవు)



# దేశం-విదేశం

NATIONAL-INTERNATIONAL





# రూ.661 కోట్ల ఆస్తుల స్వాధీనానికి ఈడీ నోటీసులు

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్) కేసులో రూ. 661 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. కాంగ్రెస్‌కు చెందిన ఈ ఆస్తులలో ఢిల్లీలోని హెరాల్డ్ హౌస్, ముంబైలోని పలు ప్రాంగణాలు, లక్నోలోని ఒక భవనం ఉన్నాయి. ఏజెఎల్, యంగ్ ఇండియన్‌పై మనీ లాండరింగ్ కేసులో ఈడీ ఈ చర్యలకు ఉపక్రమించింది. ఏజెఎల్ నేషనల్ హెరాల్డ్ న్యూస్ ప్లాట్‌ఫారం (వార్తాపత్రిక, వెబ్ పోర్టల్)నకు ప్రచురణకర్తగా యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు వ్యవహరిస్తోంది. కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ యంగ్ ఇండియన్‌లో 38 శాతం వాటాలతో అధిక వాటాదారులుగా ఉన్నారు. ఈడీ తన దర్యాప్తులో.. ఉద్దేశపూర్వకంగా యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ప్రయోజనం చేకూర్చేదిగా పనిచేసిందని ఈడీ ఆరోపించింది. సంస్థ విలువను గణనీయంగా తక్కువగా అంచనా వేసి, రూ. 2,000 కోట్ల విలువైన ఆస్తులను ఏజెఎల్ సేకరించిందని ఈడీ గుర్తించింది. రూ. 18 కోట్ల వరకు బోగస్ దానాలు, రూ. 38 కోట్ల వరకు బోగస్ అడ్వాన్స్ అద్దె, రూ. 29 కోట్ల వరకు బోగస్ ప్రకటనల రూపంలో అక్రమంగా రాబడిని సంపాదించుకునేందుకు యంగ్ ఇండియన్ ప్రయత్నించిందని ఈడీ ఆరోపించింది. ఈ నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఏజెఎల్ కేసులో రూ. 661 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు ఏజేఎల్‌కు నోటీసులు జారీ చేసింది.





# యూసుఫ్ పఠాన్‌పై బీజేపీ ఫైర్..

## కొంచమైనా సిగ్గుగా లేదా? అంటూ..

**కోల్‌కతా:** వక్ఫ్ (సవరణ) చట్టంపై పశ్చిమ బెంగాల్‌లో పెద్దఎత్తున నిరసనలు వ్యక్తమవుతున్నాయి. పలుచోట్ల హింసాత్మక ఘటనల కారణంగా ముగ్గురు మృతిచెందగా.. కొందరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ క్రమంలో రెండ్రోజుల ఘటనలకు సంబంధించి 118 మందిని అరెస్టు చేశారు. ఇలాంటి సమయంలో తృణముల్ కాంగ్రెస్ ఎంపీ యూసుఫ్ పఠాన్ చేసిన పనిని బీజేపీ తీవ్రంగా తప్పుబట్టింది. కొంచమైనా సిగ్గు అనిపించడం లేదా? అంటూ ఘాటు విమర్శలు చేసింది. కాగా, మాజీ టీమిండియా క్రికెటర్, టీఎంసీ యూసుఫ్ పఠాన్ ముర్షిదాబాద్ జిల్లాలోని మూడు పార్లమెంటరీ నియోజకవర్గాలలో ఒకటైన బహరంపూర్ నుండి లోక్‌సభ ఎంపీగా కొనసాగుతున్నారు. జిల్లాలోని సుతి, ధులియా, సంసేర్‌గంజ్ సహా మరికొన్ని ప్రాంతాలలో హింసాత్మక ఘటనలు జరుగుతున్నాయి. వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ఇక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. మాల్దా, ముర్షిదాబాద్, దక్షిణ 24 పరగణాలు, హుగ్లీ జిల్లాల్లో నిరసనకారులు పెద్దఎత్తున ఆందోళనకు దిగి రోడ్లను దిగ్బంధించారు. భద్రతా సిబ్బందిపై రాళ్లతో దాడులు చేశారు. నిషేధాజ్ఞలు విధించడంతోపాటు ఇంటర్నెట్ సేవల్ని నిలిపివేశారు.

బెంగాల్ దారుణ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఎంపీ యూసుఫ్ పఠాన్ Instagram వేదికగా తన ఫోటోలను షేర్ చేశారు. ఆయన కాఫీ తాగుతున్న ఫోటో ఒకటి కాగా.. దర్జాగా, ఉల్లాసంగా ఉన్న మరో ఫోటోను షేర్ చేశారు. దీంతో, ఎంపీ యూసుఫ్ పఠాన్‌పై బీజేపీ విరుచుకుపడింది. రాష్ట్రం, పఠాన్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో ప్రజలు అల్లాడిపోతుంటే వారి ఆదుకోకుండా, కనీసం పరామర్శించకుండా ఇలాంటి పోస్టులు పెట్టడానికి సిగ్గుగా అనిపించడం లేదా? అని ప్రశ్నించారు.

ఈ క్రమంలో బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనవల్లా ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ..'బెంగాల్ మండిపోతోంది. పోలీసులు మౌనంగా ఉండగా.. మమతా బెనర్జీ హింసను ప్రోత్సహిస్తున్నారు! ఇంతలో యూసుఫ్ పఠాన్.. ఒక ఎంపీగా ఉండి ఎంజాయ్ చేస్తున్నారు. తన నియోజకవర్గంలో హిందువులు ఊచకోతకు గురవుతున్న క్షణాన్ని ఆస్వాదిస్తున్నారు. ఇది తృణముల్ కాంగ్రెస్ అంటే అని' ఘాటు విమర్శలు చేశారు. యూసుఫ్ పోస్టుపై అటు నెటిజన్లు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇదిలా ఉండగా.. హింసాత్మక ఘటనలపై కలకత్తా హైకోర్టులో శాసనసభ విపక్షనేత సువేందు అధికారి పిటిషన్ దాఖలు చేశారు. శనివారం సెలవైనా అత్యవసర విచారణ జరపడానికి జస్టిస్ సౌమెన్ సేన్ నేతృత్వంలో ప్రత్యేక ధర్మాసనాన్ని ప్రధాన న్యాయమూర్తి నియమించారు. ముర్షిదాబాద్ జిల్లాలో కేంద్ర బలగాలను మోహరించాలని ఈ ధర్మాసనం ఆదేశించింది. పరిణామాలపై తాము కళ్లు మూసుకోలేమని జస్టిస్ సౌమెన్ సేన్ వ్యాఖ్యానించారు. వివరాలను నివేదించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించారు.



## దేశ చరిత్రలో ఘోర అధ్యాయం: ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ:** జలియన్‌వాలా బాగ్ హత్యాకాండ భారత స్వాతంత్ర్య సమర చరిత్రలో అత్యంత ఘోరమైన అధ్యాయం అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. నేటి (ఏప్రిల్ 13)తో జలియన్‌వాలా బాగ్ ఘటనకు 105 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తదితరులు జలియన్‌వాలా బాగ్ అమరులకు నివాళులు అర్పించారు. ఒక ట్వీట్‌లో ప్రధాని మోదీ జలియన్‌వాలా బాగ్ ఘటనలో వీరుల త్యాగం మనలో దేశభక్తిని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఏటా ఏప్రిల్ 13న 'జలియన్‌వాలా బాగ్ దివస్' జరుపుకుంటారు. 1919లో జరిగిన ఈ ఘటన బ్రిటిష్ వలస పాలనలో భారతీయుల విషయంలో జరిగిన అత్యంత క్రూరమైన దాడులలో ఒకటిగా చరిత్రలో నిలిచింది. నాడు పంజాబ్‌లోని అమృత్‌సర్(Amritsar)లోని జలియన్‌వాలా బాగ్ గార్డెన్‌లో బ్రిటిష్ జనరల్ రెజినాల్డ్ డయ్యర్ ఆదేశాల మేరకు నిరాయుధ ప్రదర్శనకారులపై సైనికులు తూటాల వర్షం కురిపించారు. ఈ ఘటనలో వెయ్యిమందికిపైగా జనం ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక మైలురాయిగా నిలిచింది. ఈ హత్యాకాండ తర్వాత మహాత్మా గాంధీ నాయకత్వంలో అహింసా ఉద్యమం బలపడింది. జలియన్‌వాలా బాగ్ ఘటన బ్రిటిష్ వలస పాలకుల క్రూరత్వాన్ని తెలియజేస్తుంది.

## గంటలో నాలుగు భూకంపాలు.. భారత్‌లోనూ..



**న్యూఢిల్లీ:** ఈ రోజు (ఆదివారం, ఏప్రిల్ 13) ఉదయం ఒక గంట వ్యవధిలో భారతదేశం, మయన్మార్, తజికిస్తాన్‌లలో నాలుగు భూకంపాలు సంభవించాయి. దీంతో జనం ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. మొదటి భూకంపం తజికిస్తాన్‌లోని ఫైజాబాద్‌కు సమీపంలో సంభవించగా, ఆ తర్వాత మయన్మార్‌లోని మీక్టిలాలో, అనంతరం భారతదేశంలోని జమ్మూ కశ్మీర్‌లోగల కిష్త్వార్‌లో, ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో భూకంపాలు నమోదయ్యాయి. ఈ భూకంపాల కారణంగా ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం జరగలేదు. తజికిస్తాన్(Tajikistan)లో భూకంప తీవ్రత 6.0గా నమోదయ్యింది. దేశంలోని ఫైజాబాద్ సమీపంలో ఈ భూకంపం సంభవించింది. ఉదయం 9:00 గంటలకు భూ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ఒక గంటలో సంభవించిన నాలుగు భూకంపాలలో ఇది మొదటిది. మయన్మార్‌లో భూకంపం 5.5 తీవ్రతతో వచ్చింది. మీక్టిలా సమీపంలో భూ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. 2025, మార్చి 28న 7.7 తీవ్రతతో సంభవించిన భూకంపం తర్వాత ఈరోజు తిరిగి బలమైన భూకంపం సంభవించింది. జనం ఇళ్ల నుంచి భయంతో బయటకు పరుగులు తీశారు. జమ్ముకశ్మీర్‌లోని హిమాలయన్ ప్రాంతంలో 4.2 తీవ్రతతో భూకంపం సంభవించింది. స్థానికులు భయంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చారు. ఈ భూకంపం కారణంగా ఎటువంటి నష్టం జరగలేదు. ఇదేవిధంగా ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో 4.0 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఈ నాలుగు భూకంపాలు ఒక గంట వ్యవధిలో చోటుచేసుకున్నాయి. ఈ భూకంపాలు భారత ఫలకం యురేషియన్ ఫలకంతో ఢీకొనడం కారణంగా సంభవించే టెక్టోనిక్ కదలికల ఫలితంగా చోటుచేసుకుంటున్నాయి. మయన్మార్‌లో 2025, మార్చి 28న సంభవించిన భూకంపంలో 3,600 మందికి పైగా జనం మృత్యువాత పడ్డారు.

# కోట్ల రూపాయలు వదులుకున్న సమంత.. ఎందుకంటే?



సమంత ఒకప్పుడు స్టార్ హీరోయిన్. ఇప్పుడు పూర్తిగా లైమ్ లైట్ లో లేకుండా పోయింది. చెప్పాలంటే గత కొన్నేళ్లలో కొత్త సినిమాలేం చేయలేదు. వెబ్ సిరీసులు చేస్తోందంతే. గతంతో పోలిస్తే సమంత క్రేజ్ కాస్త తగ్గిన మాట వాస్తవమే. కానీ ఈమె దగ్గరకొచ్చిన కోట్ల రూపాయల డీల్స్ ని ఈమె వద్దనుకుందట. స్వయంగా సామ్ ఈ విషయాన్ని బయటపెట్టింది. '20 ఏళ్లకే ఇండస్ట్రీలోకి వచ్చా. అప్పట్లో సక్సెస్ అంటే ఎన్ని సినిమాలు చేశాం, ఎన్ని బ్రాండ్లకు అంబాసిడర్ గా ఉన్నామనేదే చూసేవాళ్లు. దీంతో అంతర్జాతీయ బ్రాండ్స్ కి ప్రచారకర్తగా చేశా. నాకు చాలా ఆనందంగానూ అనిపించింది. కానీ ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. ప్రమోట్ చేయడంతో పాటు ఎంతో బాధ్యతగా ఉండాలని తెలుసుకున్నాను' 'ఒకప్పుడు ఇష్టమొచ్చిన బ్రాండ్లకు ప్రమోషన్స్ చేశా. అందుకు ఇప్పుడు నేను సారీ చెబుతున్నాను. కోట్ల రూపాయలు డబ్బు ఇస్తామని చెప్పినప్పటికీ గత ఏడాది కాలంలో 15 బ్రాండ్ల వదులుకున్నాను. ఇప్పటికీ చాలా ఆఫర్స్ వస్తున్నాయి కానీ నేను అంగీకరించట్లేదు. నాకు తెలిసిన డాక్టర్స్ ని అడిగి.. సదరు బ్రాండ్లతో ఎలాంటి హాని లేదనిపిస్తేనే ప్రమోట్ చేస్తున్నా' అని సమంత చెప్పుకొచ్చింది. నెట్ ఫ్లిక్స్ కోసం 'రక్త బ్రహ్మాండ్' అనే సిరీస్ చేస్తున్న సమంత.. నిర్మాతగానూ తొలి మూవీ 'శుభం' విడుదలకు సిద్ధం చేసింది.

# వారికి ఆనందమైతే మనమేం చేస్తాం..

## ట్రోల్స్‌పై బుల్లితెర నటి రియాక్షన్



బాలీవుడ్ భామ, బుల్లితెర నటి మౌనీ రాయ్ తెలుగువారికి సైతం సుపరిచితమైన పేరు. నాగిని సీరియల్‌తో తెలుగులోనూ ఆమెకు ఫ్యాన్స్ ఉన్నారు. బాలీవుడ్‌లో బిజీగా ఉన్న ఈ ముద్దుగుమ్మ సోషల్ మీడియాలో ఎప్పుడు టచ్‌లోనే ఉంటుంది. ఎక్కడికెళ్లినా ఫోటోలు షేర్ చేస్తూనే ఉంటోంది. అయితే సన్నగా.. మరింత అందంగా కనిపించే మౌనీ రాయ్.. ఇటీవల ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నారని వార్తలొచ్చాయి. ఆమె ఇన్‌స్టా కొన్ని ఫోటోలు, వీడియోలు షేర్ చేయగా తనపై నెట్టింట విపరీతంగా ట్రోల్స్ వచ్చాయి. తాజా ఈవెంట్‌లో తనపై వస్తున్న ట్రోల్స్‌పై స్పందించింది ఈ బుల్లితెర నటి. తాజాగా 'ది భూత్నీ' అనే మూవీలో నటిస్తోంది. ఈ సినిమా ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌ను ముంబయిలో గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు హాజరైన ముద్దుగుమ్మ తనపై వస్తున్న ట్రోల్స్‌పై స్పందించింది. ఇలాంటి నీచమైన కామెంట్స్ చేస్తూ ఆనందం పొందే వారి ట్రోల్స్‌ను తాను అస్సలు పట్టించుకోనని మౌనీ రాయ్ తెలిపింది. ఓ మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు బదులుగా తనదైన స్టైల్లో సమాధానం ఇచ్చిపడేసింది. మౌనీ రాయ్ మాట్లాడుతూ.. "ట్రోల్స్ వల్ల నాకు ఎలాంటి బాధ లేదు. నేను అలాంటి వాటిని చూడను కూడా. ప్రతి ఒక్కరూ వారి పనిని చేయనివ్వండి. నేను అలాంటి వ్యాఖ్యలను అస్సలు పట్టించుకోవాల్సిన అవసరం కూడా లేదు. ఇతరులను ట్రోల్ చేయడానికి మీరు తెర వెనుక దాక్కుని.. వాటితో ఆనందాన్ని పొందితే మనమే చేస్తాం. అలాంటి వారిని అలానే ఉండనివ్వండి" అంటూ కామెంట్స్ చేసింది. కాగా.. మౌనీ రాయ్ ప్రస్తుతం హారర్ యాక్షన్ కామెడీ చిత్రం 'ది భూత్నీ'తో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాలో ఆమె మొహబ్బత్ అనే దెయ్యం పాత్రలో కనిపించనుంది. ఈ మూవీలో సంజయ్ దత్, సన్నీ సింగ్, పాలక్ తివారీ, బెయోనిక్, ఆసిఫ్ ఖాన్ కీలక పాత్రల్లో నటించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న 'ది భూత్నీ' ఏప్రిల్ 18న థియేటర్లలో విడుదల కానుంది. ఈ సినిమా అక్షయ్ కుమార్ 'కేసరి 2'తో బాక్సాఫీస్ వద్ద పోటీ పడనుంది.

# గొప్ప మనసు చాటుకున్న తాప్సీ.. భర్తతో కలిసి సాయం!



టాలీవుడ్ హీరోయిన్ తాప్సీ గతేడాది పెళ్లిబంధంలోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. తన ప్రియుడు, డెన్మార్క్ బ్యాడ్మింటన్ ప్లేయర్ మథియాస్ బోతో ఏడడుగులు వేసింది. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో వీరి పెళ్లి వేడుక గ్రాండ్‌గా జరిగింది. చాలా ఏళ్లపాటు డేటింగ్‌లో ఉన్న వీరిద్దరు కొత్త జీవితంలోకి అడుగుపెట్టారు. అయితే అంతకుముందే తాము రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నామని చెప్పి అభిమానులకు షాకిచ్చింది ముద్దుగుమ్మ. ప్రస్తుతం హిందీ సినిమాల్లో నటిస్తోన్న ముద్దుగుమ్మ.. గతేడాది చివరిసారిగా ఫిర్ ఆయి హసీన్ దిల్‌రుబా అనే మూవీలో కనిపించింది. ఈ చిత్రాన్ని గతంలో విడుదలైన హసీన్ దిల్‌రుబాకు సీక్వెల్‌గా తెరకెక్కించారు. అంతకు ముందు షారూఖ్ ఖాన్ నటించిన డుంకీ చిత్రంలోనూ కనిపించింది. ప్రస్తుతం గాంధారీ అనే మూవీతో ప్రేక్షకులను పలకరించనుంది. దేవాశిష్ మఖీజా దర్శకత్వం వహిస్తున్నారు. యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాకు కనికా ధిల్లాన్ కథ అందించడంతోపాటు నిర్మిస్తున్నారు. అయితే తాజాగా హీరోయిన్ తాప్సీ తన మంచి మనసును చాటుకుంది. సినిమాలే కాదు సమాజ సేవలోనూ ముందుంటానని చెబుతోంది. వేసవికాలం కావడంతో ఎంతోమంది పేదలకు అండగా నిలిచింది. ఓ ప్రముఖ స్వచ్ఛంద సంస్థతో కలిసి రేకుల షెడ్డుల్లో నివాసముంటున్న పేదలకు టేబుల్ ఫ్యాన్స్, కూలర్లను అందజేసింది. తన భర్త మథియోస్ బోతో కలిసి వారి ఇంటికి వెళ్లి స్వయంగా తన చేతుల మీదుగా అందించింది. దీంతో తాప్సీ చేసిన పనికి నెటిజన్స్ ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇది చూసిన అభిమానులు తాప్సీ గ్రేట్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. మీరు కూడా ఎవరైనా డొనేట్ చేయాలనుకుంటే తన బయోలో లింక్ కూడా ఉందని ఇన్‌స్టాలో షేర్ చేసింది హీరోయిన్ తాప్సీ.

# క్రీడా వార్తలు SPORTS NEWS



# నేను ఆడిన ఇన్నింగ్స్ మా నాన్నకు నచ్చలేదు

- **క్రికెటర్ అభిషేక్ శర్మ**
- **శనివారం ఉప్పల్ మైదానంలో సన్ రైజర్స్ సంచలన విజయం**
- **విధ్వంసక బ్యాటింగ్ తో సెంచరీ సాధించిన అభిషేక్ శర్మ**
- **తాను చివరివరకు క్రీజులో ఉండాలన్నది తండ్రి కోరిక అని అభిషేక్ వెల్లడి**

**మహా :** సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాడు అభిషేక్ శర్మ పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో తన విశ్వరూపం చూపించాడు. ఉప్పల్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో 141 పరుగులతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అయితే, ఈ శతకం తన తండ్రి రాజ్‌కుమార్ శర్మను పూర్తిగా మెప్పించలేకపోయిందని అభిషేక్ స్వయంగా వెల్లడించాడు. ఐపీఎల్ చరిత్రలో ఛేదనలో అత్యధిక వ్యక్తిగత పరుగులు చేసిన ఆటగాళ్లలో అభిషేక్ ఒకడు. తన తల్లిదండ్రుల సమక్షంలో ఈ ఘనత సాధించడం సంతోషంగా ఉందని తెలిపాడు. మ్యాచ్ అనంతరం అభిషేక్ మాట్లాడుతూ, తన తండ్రి చిన్నప్పటి నుంచి తన ఆటను చూస్తున్నారని, సూచనలు చేస్తూ ప్రోత్సహిస్తుంటారని చెప్పాడు. "మా నాన్న నాకు తొలి కోచ్. ఆయన ముందు సెంచరీ చేయడం చాలా ఆనందంగా ఉంది. ఐపీఎల్‌లో ఇది నా అత్యధిక స్కోరైనా, నాన్న మాత్రం నేను చివరి వరకు క్రీజులో ఉండాలని కోరుకున్నారు. అందుకే నిన్న నేను ఆడిన ఇన్నింగ్స్ ఆయనను సంతృప్తిపర్చలేకపోయింది. ఈ విషయంలో మెరుగుపర్చుకుంటాను" అని తెలిపాడు. అంతేకాదు, తాను బ్యాటింగ్ చేస్తున్న సమయంలో ఈ షాట్ కొట్టు, ఇలా ఆడాలి అంటూ తన తండ్రి గ్యాలరీ నుంచి సైగల ద్వారా సూచనలు చేస్తుంటాడని అభిషేక్ శర్మ ఆసక్తికర అంశం వెల్లడించాడు. ఇక అభిషేక్ శర్మ తండ్రి రాజ్‌కుమార్ శర్మ మాట్లాడుతూ, ఫామ్ గురించి ఆందోళన చెందవద్దని తన కుమారుడికి చెప్పానని గుర్తు చేసుకున్నారు. "క్రికెటర్ కెరీర్‌లో ఇలాంటివి సహజం. గత మ్యాచ్‌లలో అతను రనౌట్ అయ్యాడు, కొన్నిసార్లు పరుగులు చేయలేకపోయాడు. కానీ ఈసారి ఆత్మవిశ్వాసంతో ఆడి జట్టుకు విజయాన్ని అందించాడు. రాబోయే రోజుల్లో మరింత దూకుడుగా ఆడతాడు" అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మ్యాచ్‌కు ముందు ఎస్ఆర్‌హెచ్ విజయం కోసం తప్పకుండా పరుగులు చేస్తానని అభిషేక్ తనకు చెప్పాడని రాజ్‌కుమార్ వెల్లడించారు.

# కరుణ్ నాయర్ మెరుపులు వృథా..

## ముంబై చేతిలో ఢిల్లీ ఓటమి



ఐపీఎల్ 2025లో ఢిల్లీ క్యాపిటల్స్ తొలి ఓటమి చవిచూసింది. ఈ మెగా ఈవెంట్‌లో భాగంగా అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన హై స్కోరింగ్ థ్రిల్లర్‌లో పై 12 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్ ఓటమి పాలైంది. 206 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ 19 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌటైంది. ఢిల్లీ 19 ఓవర్‌లో వరుసగా మూడు రనౌట్లు అయి మ్యాచ్‌ను చేజార్చుకుంది. ఢిల్లీ బ్యాటర్లలో ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన కరుణ్ నాయర్(40 బంతుల్లో 12 ఫోర్లు,5 సిక్స్‌లతో 89) అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. అతడితో పాటు అభిషేక్ పోరెల్(33) పర్వాలేదన్పించాడు. రాహుల్‌తో పాటు మిగితా ప్లేయర్లంతా దారుణంగా విఫలమయ్యారు. ఈ ఓటమితో కరుణ్ నాయర్ ఇన్నింగ్స్‌గా వృథా అయిపోయింది. ముంబై బౌలర్లలో ఇంపాక్ట్ ప్లేయర్ కరణ్ శర్మ మూడు వికెట్లు పడగొట్టగా.. శాంట్నర్ రెండు , బుమ్రా, చాహర్ తలా వికెట్ సాధించారు. కాగా ఈ ఏడాది సీజన్‌లో ముంబైకి ఇది రెండో విజయం కావడం గమనార్హం. తిలక్ హాఫ్ సెంచరీ..బ్యాటింగ్ చేసిన ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగుల భారీ స్కోర్ చేసింది. ముంబై బ్యాటర్లలో తిలక్ వర్మ(59) టాప్ స్కోరర్‌గా నిలవగా.. ర్యాన్ రికెల్టన్(41), సూర్యకుమార్(40), నమాన్ ధీర్(38) పరుగులతో రాణించారు. ఢిల్లీ బౌలర్లలో కుల్దీప్ యాదవ్, విప్రజ్ నిగమ్ రెండు వికెట్లు పడగొట్టగా.. ముఖేష్ కుమార్ ఓ వికెట్ సాధించారు.



# రికార్డు అర్ధ శతకంతో సత్తా చాటిన విరాట్..

## రాయల్స్‌పై ఆర్సీబీ ఘన విజయం

ఐపీఎల్ 2025లో భాగంగా జైపూర్ వేదికగా ఇవాళ (ఏప్రిల్ 13) మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై ఆర్సీబీ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. రాయల్స్ ఇన్నింగ్స్‌లో యశస్వి జైస్వాల్ (47 బంతుల్లో 75; 10 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించగా.. ధృవ్ జురెల్ (35 నాటౌట్), రియాన్ పరాగ్ (30) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. కెప్టెన్ సంజూ శాంసన్ (15) మరోసారి నిరాశపర్చగా.. ఆఖర్లో వచ్చిన హెట్‌మైర్ 9, నితీశ్ రాణా 4 (నాటౌట్) పరుగులు చేశారు. ఆర్సీబీ బౌలర్లలో భువనేశ్వర్ కుమార్, యశ్ దయాల్, హాజిల్‌వుడ్, కృనాల్ తలో వికెట్ తీశారు. అనంతరం 174 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఆర్సీబీ 17.3 ఓవర్లలో ఫిల్ సాల్ట్ (33 బంతుల్లో 65; 5 ఫోర్లు, 6 సిక్సర్లు) వికెట్ మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. విరాట్ కోహ్లి (45 బంతుల్లో 62 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్సర్లు) టీ20 కెరీర్‌లో 100 హాఫ్ సెంచరీ పూర్తి చేసి ఆర్సీబీని విజయతీరాలకు చేర్చాడు. పడిక్కల్ (28 బంతుల్లో 40 నాటౌట్; 5 ఫోర్లు, సిక్స్) బౌండరీ కొట్టి మ్యాచ్‌ను లాంఛనంగా ముగించాడు. ఈ గెలుపుతో ఆర్సీబీ పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి ఎగబాకగా.. రాయల్స్ అదే ఏడో స్థానంలో కొనసాగుతుంది.

# చరిత్ర సృష్టించిన విరాట్ కోహ్లి.. మరో సెంచరీ

ఐపీఎల్ 2025లో భాగంగా రాజస్థాన్ రాయల్స్‌తో ఇవాళ (ఏప్రిల్ 13) మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో ఆర్సీబీ స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లి చరిత్ర సృష్టించాడు. ఈ మ్యాచ్‌లో 39 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసిన విరాట్.. టీ20ల్లో 100 హాఫ్ సెంచరీలు పూర్తి చేసిన తొలి భారత్ మరియు ఆసియా ఆటగాడిగా రికార్డుల్లోకెక్కాడు. ఓవరాల్‌గా చూసినా డేవిడ్ వార్నర్ మాత్రమే విరాట్ కంటే ముందు టీ20ల్లో 100 హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకున్నాడు. వార్నర్ 400 టీ20 మ్యాచ్‌ల్లో 108 హాఫ్ సెంచరీలు చేయగా.. విరాట్ తన 388వ టీ20 ఇన్నింగ్స్‌లో ఈ ఘనత సాధించాడు. టీ20ల్లో విరాట్ 388 ఇన్నింగ్స్‌లు ఆడి 9 సెంచరీలు, 100 హాఫ్ సెంచరీల సాయంతో 13100 పైచిలుకు పరుగులు చేశాడు.

**టీ20ల్లో అత్యధిక హాఫ్ సెంచరీలు చేసిన టాప్-5 ప్లేయర్లు**

వార్నర్ 108, విరాట్ 100, బాబర్ ఆజమ్ 90, గేల్ 88, బట్లర్ 86 కాగా, రాయల్స్‌తో మ్యాచ్‌లో విరాట్ రికార్డు హాఫ్ సెంచరీతో చెలరేగడంతో ఆర్సీబీ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తద్వారా పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి ఎగబాకింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. రాయల్స్ ఇన్నింగ్స్‌లో యశస్వి జైస్వాల్ (47 బంతుల్లో 75; 10 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించగా.. ధృవ్ జురెల్ (35 నాటౌట్), రియాన్ పరాగ్ (30) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. కెప్టెన్ సంజూ శాంసన్ (15) మరోసారి నిరాశపర్చగా.. ఆఖర్లో వచ్చిన హెట్‌మైర్ 9, నితీశ్ రాణా 4 (నాటౌట్) పరుగులు చేశారు. ఆర్సీబీ బౌలర్లలో భువనేశ్వర్ కుమార్, యశ్ దయాల్, హాజిల్‌వుడ్, కృనాల్ తలో వికెట్ తీశారు. అనంతరం 174 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఆర్సీబీ.. 17.3 ఓవర్లలో ఫిల్ సాల్ట్ (33 బంతుల్లో 65; 5 ఫోర్లు, 6 సిక్సర్లు) వికెట్ మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. విరాట్ కోహ్లి (45 బంతుల్లో 62 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్సర్లు) అజేయమైన అర్ధ సెంచరీతో ఆర్సీబీని విజయతీరాలకు చేర్చాడు. పడిక్కల్ (28 బంతుల్లో 40 నాటౌట్; 5 ఫోర్లు, సిక్స్) బౌండరీ కొట్టి మ్యాచ్‌ను లాంఛనంగా ముగించాడు. విరాట్ హాఫ్ సెంచరీల సెంచరీని విరాట్ సిక్సర్‌తో అందుకోవడం విశేషం. ప్రస్తుత సీజన్‌లో విరాట్‌కు ఇది మూడో హాఫ్ సెంచరీ. అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో విరాట్ ఐదో స్థానానికి ఎగబాకాడు. ఈ సీజన్‌లో విరాట్ 6 మ్యాచ్‌ల్లో 62 సగటున, 143.35 స్ట్రయిక్ రేట్‌తో 248 పరుగులు చేశాడు. 6 మ్యాచ్‌ల్లో 349 పరుగులు చేసిన పూరన్ అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో టాప్ ప్లేస్‌లో ఉన్నాడు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

# ఘనంగా మట్టల ఆదివారం



**హుజూర్ నగర్, మహా:** హుజూర్నగర్ పట్టణం శ్రీనగర్ కాలనీ కాలనీలో సిఎస్ఐ షాలోమ్ చర్చి నందు మట్టల ఆదివారాన్ని పురస్కరించుకొని సంఘ కమిటీ మరియు సంఘవిశ్వాసులందరూ జయకరంగా ఊరేగింపు జరిగినది ఈ కార్యక్రమం లో సాగర్ గ్రూప్ చైర్మన్ రెవ. జి జె కాంతారావు గారు యేసు క్రీస్తు ప్రభువు సమాధాన రాజుగా ఆనాడు ఎరుషలేములో జయప్రవేశం చేశారని ఈ పండుగలో పాలు పొందిన వారందరికీ ఈనాడు ఇది సమాధానం కలిగించేది అని సందేశం ఇవ్వడం జరిగింది . చర్చి ని మట్టలతో యవ్వనస్తులు అలంకరించినారు.ఈ కార్యక్రమంలో శ్రీనగర్ కాలనీ శాలోం చర్చికి చెందిన పాస్టేట్ సెక్రటరీ డా: పి.డానియేల్ , ట్రెజరర్ శ్రీమతి.యన్ స్వాతి గ్రూప్ చైర్మన్ అమ్మగారు శ్రీమతి, వరకుమారి మరియువిశ్వాసులందరూ పాలు పొందునారు.

# శుభకార్యాలలో కంది శ్రీనవాస రెడ్డి





**ఆదిలాబాద్, మహా :** అభిమానంతో ఆహ్వానించిన వారి శుభకార్యాలకు హాజరవుతూ అందరినీ ఆప్యాయంగా పలకరిస్తారు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి.ఆదివారం ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్ గూడ గ్రామంలోని రుక్మిణి గార్డెన్ లో కాంగ్రెస్ నాయకులు అల్చెట్టి నాగన్న కుమార్తె విశాఖ , అనుముల ఊష న్నకుమారుడు వంశీ ల నిశ్చితార్థ వేడుకలకు హాజరయ్యారు. కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించి కంది శ్రీనన్న కానుకను బహుకరించారు. ఫంక్షన్ హాల్లో కంది శ్రీనన్న అభిమానులు ఆయనతో సెల్ఫీ దిగేందుకు ఉత్సాహం చూపించారు. అనంతరం రాజ్ మహల్ ఫంక్షన్ హాల్ లో కాంగ్రెస్ నాయకులు మంచాల మల్లయ్య మనవరాలి నూతన వస్త్రాలంకరణ వేడుకలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్,గొర్ల రాజు యాదవ్,మహిళా నాయకురాలు శ్రీలేఖ,నాయకులు మునిగేల విట్టల్,రాహుల సోమన్న యాదవ్,గజ్జి వెంకన్న యాదవ్,బూర్ల శంకరయ్య,దాసరి ఆశన్న,దొగ్గలి రాజేశ్వర్,మొహమ్మద్ రఫీక్,డేరా కృష్ణ రెడ్డి,అశోక్,నరిగె ఆశన్న యాదవ్, మునిగేల విట్టల్,మొహమ్మద్ రఫీక్,కొండూరి రవి, మామిల్ల భూమయ్య, సార్ల సత్యనారాయణ,పార్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు

## మున్నూరు కాపుల అభివృద్ధికి కృషి చేస్తాం

- **అధ్యక్ష, కార్యదర్శులు బిక్షపతి, ఓం ప్రకాష్**
- **బాలాజీ మున్నూరు కాపు సంఘం నూతన కమిటీ ఎన్నిక**



**ములుగు, మహా :** మున్నూరు కాపుల అభివృద్ధికి కృషి చేస్తామని, ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాలు వర్తింపజేసుకొని ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని బాలాజీ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు చింత నిప్పుల బిక్షపతి, పొడల ఓం ప్రకాష్ స్పష్టం చేశారు. ఆదివారం ములుగు లో జరిగిన సమావేశంలో ఎడ్ల సంపత్, బాణాల సుధాకర్ ఆధ్వర్యంలో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా చింత నిప్పుల బిక్షపతి, కార్యదర్శిగా పొడాల ఓం ప్రకాష్, ఉపాధ్యక్షులు తోట తిరుపతి, కోశాధికారి సముద్రాల రఘు, సంయుక్త కార్యదర్శి సురేష్, డైరెక్టర్లు కుమార్, రాజు, బిక్షపతి, మధు, విజేందర్ లు ఎన్నికయ్యారు. తమపై ఎంతో నమ్మకంతో ఎన్నుకున్నందుకు సంఘ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సంఘంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా ముందుండి తోడ్పాటునందిస్తామని పేర్కొన్నారు.

## సన్నబియ్యం పంపిణీ దేశంలోనే
# చారిత్రాత్మక నిర్ణయం

- **సామాన్యులు సన్నబియ్యంతో భోజనం చేయడమే ప్రభుత్వ లక్ష్యం**
- **పేదోని ఇంట్లో భోజనం చేసిన మంత్రి శ్రీధర్ బాబు**



**కాటారం, మహా :** సన్నబియ్యం పంపిణీ దేశంలోనే చారిత్రాత్మకమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఆదివారం కాటారం మండలం, కొత్తపల్లి తండా గ్రామ నివాసి శ్రీమతి వాంకుడోతు సమ్మక్క ఇంట్లో సన్నబియ్యంతో చేసిన బోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రేషన్ కార్డులున్న నిరుపేదల కుటుంబాలు సన్నబియ్యం ఆహారాన్ని భుజించాలనే సంకల్పం తో ఉగాది పండుగ రోజున రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సన్నబియ్యం పంపిణిని ప్రారంభించారని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి వాంకుడోతు సమ్మక్క కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సన్నబియ్యం ఎలా ఉన్నాయి, దొడ్డు బియ్యానికి సన్నబియ్యానికి తేడా ఉందా లేదా అని అడిగి తెలుసుకున్నారు.పేదలు కడుపునిండా సన్నబియ్యం తో భోజనం చేయాలని అందుకు సన్న రకం ధాన్యం అవసరమని భావించిన ప్రభుత్వం సన్నరకం ధాన్యం సాగు చేసిన రైతులకు బస్తాకు రూ,500 ల బోనస్ చెల్లించినట్లు తెలిపారు. సన్నబియ్యం పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మండల ప్రత్యేక అధికారి, డిఆర్డీఓ నరేష్, తహసీల్దార్ నాగరాజు, ఎంపిడిఓ బాబు, ఎంపివో వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## నేడే ఆంజనేయస్వామి నూతన దేవాలయం విగ్రహ ప్రతిష్ట



**హుజూర్ నగర్, మహా:** మఠంపల్లి మండలం గుండ్లపల్లి గ్రామంలో ఆంజనేయ స్వామి నూతన దేవాలయం మరియు స్వామివారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమం ఘనంగా అంగరంగ వైభోగంగా జరుగునని నిర్వహణ అధ్యక్షులు గుండా బ్రహ్మ రెడ్డి తెలిపారు. ఇట్టి కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ ఈ ఈ నూతన దేవాలయం దేదీప్యమానంగా వేద బ్రాహ్మణోత్తములచే మహాయజ్ఞం నగర సంకీర్తన మంగళ వాయిద్యాలుతో నిర్వహించబడునని తదుపరి స్వామి విగ్రహ ప్రతిష్ఠించడం జరుగుతుంది కనుక ఇట్టి కార్యక్రమంలో యావన్మంది భక్త మహాశయులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదలు స్వీకరించి స్వామివారి కృప పాత్రలు కావలసిందిగా కోరారు.

## ఫైర్ సేఫ్టీ నిబంధనలను
# ప్రతి ఒక్కరు పాటించాలి



**ములుగు, మహా :** ప్రతి ఒక్కరూ ఫైర్ సేఫ్టీ నిబంధనలను పాటించాలని, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు వేగంగా తమకు సమాచారం అందిస్తే వెంటనే ప్రమాద నియంత్రణ చర్యలను చేపడతామని ములుగు జిల్లా ఫైర్ ఆఫీసర్ కె.కుమారస్వామి అన్నారు. అగ్ని ప్రమాద వారోత్సవాల్లో భాగంగా ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు జిల్లాలో చేపట్టనున్న అవగాహన కార్యక్రమాలపై ఆదివారం ములుగులో మీడియా సమావేశం నిర్వహించారు. వారోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఫైర్ ఆఫీసర్ కుమారస్వామి మాట్లాడుతూ.. అగ్నిప్రమాదాల నివారణ పట్ల అవగాహన పెంచుకావాలని, వేసవికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. 1944 ఏప్రిల్ 14న ముంబాయి విక్టోరియా డాక్యార్డ్లో ఒక నౌకకు అగ్నిప్రమాదం సంభవించి విధి నిర్వహణలో అసువులు బాసిన 66మంది అగ్నిమాపక సిబ్బంది స్మారకార్థం దేశవ్యాప్తంగా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కర్తవ్య నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అగ్నిమాపక సిబ్బందికి జోహార్లు అర్పించడం, అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్త చర్యల గురించి ప్రచారం చేస్తూ ప్రజలను చైతన్య వంతులనుచేయడం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. అతిచిన్న నిప్పురవ్వను ఆర్పకుండా నిర్లక్ష్యం అతి ఘోరమైన ప్రమాదం కలిగిస్తుందన్నారు. ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు మనోస్తైర్యం కోల్పోకుండా అగ్నిమాపక కేంద్రానికి సమాచారము అందించాలని సూచించారు. ఈ నెల 14న అగ్నిమాపక పరేడ్ నిర్వహించి స్టాల్స్ ద్వారా అవగాహన కల్పిస్తామని, 15న ఆర్టిస్ట్ ఆర్టీసీ బస్టాండ్ ఇతర పబ్లిక్ ప్రాంతాలలో అగ్ని ప్రమాద నివారణ పై అవగాహన, 16న ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద, 17న ప్రగతి కాలనీ ఇతర ప్రాంతాల్లో, 18న హెచ్పీ గ్యాస్ వద్ద, 19న సినిమా థియేటర్లలో, 20న అగ్నిమాపక కేంద్రం జిల్లా కార్యాలయం వద్ద ముగింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లీడింగ్ ఫైర్ మాన్ పి.మహేశ్వర్, సిబ్బంది కుమార్, ఎం.మహేందర్, సిహెచ్.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా తానా వరంగల్
# నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



**వరంగల్ మహా:** తెలంగాణ హాస్పిటల్స్,నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ (తానా) వరంగల్ శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం అట్టహాసంగా వరంగల్ లోని ఐ ఎం ఏ హాల్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు. నూతన కార్యవర్గం వివరాలు.. అధ్యక్షుడుగా డా. ముక్క దిలీప్ కుమార్ సెక్రటరీ: డా. ఎల్. నాగేశ్వర్ రావు, ట్రెజరర్ గా డా. వి. నరేష్ కుమార్, ఉపాధ్యక్షులుగా అర్బన్ డా సి రాకేష్ రెడ్డి, రూరల్.. డా. వి. ఎం. జయుడు, ఉమెన్: డా. పి. స్వర్ణలత ఎన్నిక కాగా జాయింట్ సెక్రటరీలు అర్బన్: డా జి కృష్ణమూర్తి, రూరల్: డా రాజేశ్వర్ ప్రసాద్, ఉమెన్ డా బి వరలక్ష్మి ఎన్నుకోబడ్డారు. ఈ సందర్భంగా అధ్యక్షులు డా ముక్క దిలీప్ కుమార్ మాట్లాడుతూ, ప్రైవేట్ హాస్పిటల్ , క్లినిక్ అనుమతులు సులభతరం చేసేందుకు సింగిల్ విండో సిస్టమ్ విధానం అమలు కోసం ప్రభుత్వం తో చర్చలు జరుపుతామని అలాగే నకిలీ వైద్యుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక పోస్టర్‌ను ఆవిష్కరించారు. అంతేకాకుండా ఉమ్మడి వరంగల్ జిల్లా లోని అన్ని తానా హాస్పిటల్స్ వద్ద నకిలీ వైద్యులపై అప్రమత్తం చేసే బోర్డుల ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తానా జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో తానా వరంగల్ మాజీ అధ్యక్షుడు డా పి. ప్రవీణ్, మాజీ సెక్రటరీ డా సి రాకేష్ రెడ్డి, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డా పి కాళీ ప్రసాద్ రావు, సీనియర్ నాయకులు, సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యులు డా. పి. విజయచందర్ రెడ్డి, ఐఎంఏ వరంగల్ జిల్లా అధ్యక్షుడు డా కె నాగార్జున రెడ్డి, సెక్రటరీ డా అజిత్ మహమ్మద్, ట్రెజరర్ డా. శిరీష్ కుమార్, డా. కస్తూరి ప్రమీల, డా. హెచ్. సంధ్యారాణి, డా.మన్మోహన్ రాజు, డా. పి. సుధీర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణకే
# జై భీమ్ జై బాపు జై సంవిధాన్ కార్యక్రమం

రాజ్యాంగ పరిరక్షణకై మనమంతా కలిసికట్టుగా పోరాడాలి




వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని

**హన్మకొండ మహా:** రాహుల్ గాంధీ నేతృత్వంలో దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజ్యాంగ పరిరక్షణకే జై భీమ్ జై బాపు జై సమ్మిదాన్ కార్యక్రమం అని వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం హన్మకొండ 30..31 వ డివిజన్ల లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు...! జై భీమ్...!! జై సంవిదాన్...!!! అభియాన్ పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పాదయాత్రలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు , నాయకులు,ప్రజలతో కలిసి రాజ్యాంగం పై బీజేపీ చేస్తున్న కుట్ర ను ప్రజలకు వివరించారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజ్యంగ విలువల పై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. పేద, బలహీన వర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవేరటం లేదని, ప్రధానికి పేద ప్రజల కంటే బడా బాబులు ముఖ్యం అన్నారు. ఈ పోరాటం మన కోసమే కాదు మన భవిష్యత్తు తరాల కోసమని స్పష్టం చేసారు. కాంగ్రెస్ కార్యకర్తలు రాహుల్ గాంధీ సైనికులగా పనిచేసే రానున్న ఎన్నికల్లో ప్రధానమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. జై బాపు జై భీమ్ జై సమ్మిదాన్ కార్యక్రమం గ్రామంలోని ప్రతి ఇంటికి చేరే విధంగా కృషి చేయాలని నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు , తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో వెయ్యి ఉపాధ్యాయ
# అక్రమ పోస్టింగులు



**రంగారెడ్డి జిల్లా, మహా:** జిల్లాలో సుమారు వెయ్యి ఉపాధ్యాయ ఖాళీ పోస్టులను GO 317ను ఆసరగా చేసుకొని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఉపాధ్యాయులతో భర్తీ చేసిన విద్యాశాఖ అధికారులు. ఈ వ్యవహారంలో భారీగా అవినీతి అక్రమాలు జరిగాయని సేవ్ టీచర్స్ సంఘం ముక్తకంఠంతో తెలియజేస్తుంది. సేవ్ టీచర్స్ సంఘం ఆధారాలను సేకరించిందని, న్యాయం కోసం, న్యాయం పోరాటం చేస్తూనే, ప్రత్యక్ష పోరాటాలతో జిల్లా లోని ఉపాధ్యాయ సంఘాలు, అన్ని వర్గాల మద్దతుతో, రంగారెడ్డి జిల్లాలో అక్రమంగా పోస్టింగ్స్ పొందిన ఉపాధ్యాయులందరినీ వెనక్కి పంపే వరకు, సేవ్ టీచర్స్ సంఘం పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువకులకు భరోసా ఇస్తున్నామని బొడ్డు రవి తెలిపారు. మాకు రావాల్సిన ఉద్యోగాలు మరొకరికి... తెలంగాణ సేవ్ టీచర్స్ సంఘం గౌరవ అధ్యక్షులు బొడ్డు రవి మాట్లాడుతూ... అప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్ర పాలకుల అనుచివేతలతో మనకు రావాల్సిన ఉద్యోగాలను వాళ్ళు ఎగరేసుకుపోయారు. ఇప్పుడు పోరాడి తెచ్చుకున్న స్వరాష్ట్రంలో మన ప్రాంతానికి రావాల్సిన ఉద్యోగాలు రాకుండా, GO 317ను ఆసరాగా చేసుకుని అధికార బలంతో మరో జిల్లా వ్యక్తులకు కట్టబెట్టడం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2021 నుండి నా శక్తికి మించి అలుపెరుగని పోరాటం చేస్తున్నాను. నాపై ఎన్నో కుట్రలు చేశారు. అయినా ధర్మం కోసం ధైర్యంగా నిలబడ్డాను. మా విద్యాశాఖలో జరిగిన ఎన్నో అక్రమాలు బయటకు తీయడం జరిగిందన్నారు. నిమ్మకు నీరెత్తనట్టుగా వ్యవహరిస్తూ, జిల్లా ఉన్నత విద్యాధికారి చోద్యం చూస్తున్నారని ఆయన మండిపడ్డారు. తనకు రాజకీయ నాయకులు మద్దతు ఇవ్వడం లేదన్నారు. భవిష్యత్లో స్థానిక రాజకీయ నాయకులకు మన జిల్లాలో మనుగడ కష్టమేనని స్పష్టంగా తెలియజేశారు.

## దావీదు తనయ
# హోసన్నా



**హుజూర్ నగర్,మహా:** శుభవార్త దేవాలయంలో మట్టల ఆదివారాన్ని విచారణ గురువులు ఫాదర్ మార్టిన్ పసల ఆధ్వర్యంలో ఘనంగా ఆదివారం నిర్వహించారు. ఉదయం నుంచే వందలాది మంది భక్తు లు తరలిరావడంతో దేవాలయం కిటకిటలాడిం ది.ఉదయం సెంట్ ఆన్స్ పాఠశాల ఆవరణలో నుండి భక్తులు ప్రత్యేక గీతలాపన తో ఆశీర్వదించిన మట్టలను చేత పట్టుకొని భక్తి భావంతో దేవాలయం చుట్టూ ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో రావడం చర్చి ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. అనంతరం దివ్యబలి పూజలో ఫాదర్ మార్టిన్ ప్రసంగిస్తూ యేసు ప్రభువు జేరుసలేం పట్టణంలో ప్రప్రథమంగా ప్రవేశించినపుడు అక్కడి ప్రజలు యేసు ప్రభువును గాడిదపై తీసుకుని వస్తూ పెద్దఎత్తున వివిధ రకాల మట్టలతో (చెట్ల కొమ్మలతో) ఘన స్వాగతం పలుకుతారు. దీనినే క్రైస్తవులు మట్టల పండుగగా ఆచరిస్తారని యేసు నందు నిద్రించిన వారు ధన్యులని వారి ఆత్మలు యేసు ఆత్మ చేత పరిశుద్ధమవుతాయన్నారు. ఈ పండగను గుడ్ ఫ్రైడేకు ముందు వచ్చే ఆదివారం జరుపు కొంటారు. ఈ వారాన్ని పరిశుద్ధ వారంగా పరిగణిస్తారనీ తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో ఫాదర్ గాదె పాపిరెడ్డి, శుభోదయ యువజన సంఘం అధ్యక్షులు గాదె జయ భారత్ రెడ్డి ,మరియు సంఘ సభ్యులు,చర్చి కమిటీ పెద్దలు బాలరెడ్డి,ఆంటోని రెడ్డి ,చిన్నపు రెడ్డి,సునీల్ రెడ్డి ,కాకుమాను జోసెఫ్ మరియు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధ పోస్టల్ యూనియన్ల
# నూతన కార్యవర్గం ఎన్నిక

### ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం
### బిఎంఎస్ జిల్లా అధ్యక్షుడు పసుల శ్రవణ్



**కరీంనగర్, మహా:** భారతీయ పోస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గ్రూప్ సి, పోస్ట్‌మాన్ , ఎమ్.టి.ఎస్ విభాగాలకు సంబంధించిన భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధ యూనియన్ల నూతన కార్యవర్గాన్ని కరీంనగర్ ప్రధాన పోస్టాఫీస్ లో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బిఎంఎస్ జిల్లా అధ్యక్షుడు పసుల శ్రవణ్ మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి బిఎంఎస్ విశ్వసనీయ వేదికగా నిలుస్తుందన్నారు. ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా, నిరంతరం అందుబాటులో ఉంటూ అండగా ఉంటామని తెలిపారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా ప్రతి ఉద్యోగి తన పనిని నిబద్ధతతో నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పోస్టల్ సూపర్వైజర్ అసోసియేషన్ ఆర్ఆర్ కార్యదర్శి కె.వి. పవన్‌కుమార్ మాట్లాడుతూ బీఎంఎస్ లో చేరడం ఉద్యోగుల భవిష్యత్‌కు దోహదపడుతుందని, సంఘ బలమే హక్కుల సాధనకు మార్గమన్నారు. ఉద్యోగులు ఐక్యంగా నిలబడితే సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని ఆయన పేర్కొన్నారు. భారతీయ పోస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గ్రూప్ సి డివిజన్ అధ్యక్షునిగా పంగ అంజయ్య, ఉపాధ్యక్షునిగా బైరి ప్రదీప్, కార్యనిర్వాహక అధ్యక్షునిగా సకినాల అనిల్‌కుమార్, కార్యదర్శిగా నాగుల ఆంజనేయులు, సహాయ కార్యదర్శులుగా పి రమేష్, రాజమల్లు , సంఘటన కార్యదర్శిగా జంపాల సాయిక్రిష్ణ లను, భారతీయ పోస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పోస్ట్ మాన్ , ఎమ్ టి ఎస్ కరీంనగర్ డివిజన్ అధ్యక్షునిగా దాడి మల్లేశం, కార్యనిర్వాహక అధ్యక్షునిగా మిట్టపల్లి సదయ్య, కార్యదర్శిగా ఓరుగంటి విష్ణువర్ధన్, సహాయ కార్యదర్శిగా చౌహాన్ లఖన్, కోశాధికారిగా రేగుల రాజ్ కుమార్ లని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని బి ఎం ఎస్ జిల్లా కార్యదర్శి తొర్తి శ్రీనివాస్ ఈ సందర్భంగా తెలిపారు

## సూరవీడులో
# ఢీ కొన్న లారీలు



ఇద్దరికి తీవ్రగాయాలు

వెంకటాపురం, మహా ; ములుగు జిల్లా వెంకటాపురం మండలం సూరవీడు గ్రామంలోని మూలమలుపు వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీ కొట్టుకోవటంతో ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఒక డ్రైవరు క్యాబిన్లో ఇరుక్కుపోగా.. మరో డ్రైవర్ కి కాలు విరిగింది.దీంతో గ్రామస్తులు క్షతగాత్రులను 108 లో వెంకటాపురం హాస్పిటల్ కి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.ఇసుక ర్యాపుల కారణంగా ఇటీవల కాలంలో వెంకటాపురం మండలంలో లారీల ట్రాఫిక్ వల్ల ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్లపైన భారీ గుంతలు ఏర్పడడంతో లారీల రద్దీ ఎక్కువగా ఉండడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

## హక్కుల సాధనతోపాటు
# బాధ్యతలు నెరవేర్చాలి

- **మానవ మేధస్సుకు పదును పెట్టాలి**
- **విద్యార్థులకు చదువే ఆయుధం**
- **సెమినార్ లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**




**కరీంనగర్, మహా:** హక్కుల సాధనతో పాటు దేశ పౌరులుగా బాధ్యతను కూడా నెరవేర్చాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా శాతవాహన యూనివర్సిటీలో సమగ్రాభివృద్ధికి సంక్షేమ పథకాలు అనే అంశం పై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ దేశం కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుల స్ఫూర్తిని కొనసాగించాలని అన్నారు. అందుకు చదువు అనే ఆయుధాన్ని స్వీకరించాలని తెలిపారు. దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మహనీయులంతా ఉన్నత విద్య అభ్యసించిన వారేనని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరికి హక్కులు గుర్తుంటాయని, ఆ హక్కుల సాధనకు పోరాడుతారని తెలిపారు. అదేవిధంగా దేశ పౌరుడుగా ప్రతి ఒక్కరూ తన బాధ్యతను కూడా నెరవేర్చాలని సూచించారు.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్, మహాత్మ జ్యోతిబాపూలే ఉన్నత చదువులు అభ్యసించి దేశ అభివృద్ధికి పునాదులు వేశారని తెలిపారు. దేశంలో నాటుకు పోయిన తరతరాల మూఢాచారాలను తొలగించారని అన్నారు. యువత వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని తెలిపారు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. టెక్నాలజీని వినియోగించుకుంటూనే మానవమేధస్సుకు పదును పెట్టాలని సూచించారు. సమాజ సేవలో నేటి యువత తమ వంతు బాధ్యత నెరవేర్చాలన్నారు. నిత్యం పుస్తక పఠనం చేస్తూనే, వివిధ రంగాలలో నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవాలని సూచించారు.

శాతవాహన యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులంతా మహనీయుల చరిత్రను తప్పక తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు మార్గాలను భవిష్యత్తు తరాలు అనుసరిస్తాయని విషయం గుర్తుంచుకోవాలని తెలిపారు. విశ్వవిద్యాలయంలో మహనీయుల జయంతిని ఒక ఉద్యమంలా చేస్తున్నామని, ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు గత చరిత్ర తెలుస్తుందని అన్నారు. మహనీయులు అందించిన ఫలాలను సద్వినియోగం చేసుకొని విద్యా ఉపాధి రంగాల్లో మంచి ఫలితాలు సాధించాలని తెలిపారు. గంగాధర ఎంపీడీవో దాముని రాము మాట్లాడుతూ దేశంలోని అసమానతలను,రుగ్మతలను రూపుమాపేందుకు, భావి భారత నిర్మాణానికి ప్రణాళికలు రచించిన సమతామూర్తులని ఎప్పటికీ మరువరాదని అన్నారు. మహిళ సాధికారతే దేశ అభివృద్ధిగా చెప్పిన మహనీయుల బాటలో నడవాలని సూచించారు. ఎస్ ఆర్ ఆర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రగతి మార్గానికి దోహదపడే పథకాలు చాలా ఉన్నాయని వాటిని అమలు చేయడమే మహనీయులకు మనమిచ్చే గౌరవమని అన్నారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి సెమినార్ కు సంబంధించిన పుస్తకాలను ఆవిష్కరించారు.